ప్రజాశక్తి
ఆదివారం 25 ఆగస్టు 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

ప్రభుత్వ శాఖల్లో బదిలీల జాతర

- ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే నిర్వహణ
- సిఫార్సులకు దూరంగా పోలీసుశాఖలో జాబితా పూర్తి



గుంటూరులోని మెప్మా కార్యాలయం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలోని దాదాపు 15 శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు ముమ్మర కసరత్తు జరుగుతోంది. బదిలీలపై ఉద్యోగులు, అధికారులు ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. తాము కోరుకున్న స్థానంలో ఉండేందుకు స్థానికంగా అంతర్గత బదిలీలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒక స్థానం నుంచి మరోక స్థానం మారడం ద్వారా బదిలీ జరిగిందని చూపేందుకు ఉమ్మడి జిల్లాలోని పలువురు ఉద్యోగులు ప్రయత్నిస్తున్నారు. దీంతో ఎక్కువ మంది పట్టణ ప్రాంతాలకు రాలేక గ్రామీణ ప్రాంతాలకు పరిమితం అవుతున్నారు. మెప్మా జిల్లా కార్యాలయంలో ఈ తంతు ఎక్కువగా జరుగుతోంది. మొత్తం 15 శాఖల్లో బదిలీలకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈనెల 19 నుంచి 31 వరకు బదిలీలకు అవకాశం ఇచ్చారు. ప్రజా సంబంధిత సేవల్లో ఉండే శాఖలకు మాత్రమే అవకాశం కల్పించారు.

ఒకేచోట ఐదేళ్ల పనిచేసిన వారికి బదిలీ తప్పనిసరి చేశారు. జులై 31 నాటికి ఒకే ప్రాంతంలో ఐదేళ్ల పనిచేస్తే బదిలీకి దరఖాస్తు చేయవచ్చు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు కూడా బదిలీల్లో అవకాశం ఇచ్చారు. జిల్లా మొత్తం మీద మొత్తం 40 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో ఉపాధ్యాయులను మినహాయిస్తే దాదాపు 24 వేల మంది ప్రభుత్వ ఉద్యోగుల్లో ఒకే ప్రదేశంలో ఐదేళ్ల దాటిన వారంతా దాదాపు 8 వేల మంది ఉంటారని అంచనా వేస్తున్నారు. రెవెన్యూ శాఖలో ఎక్కువ బదిలీలు జరగనున్నాయి. రెవెన్యూ వివాదాల్లో అనేక మంది ఉద్యోగుల పాత్ర కూడా కీలకంగా ఉండటంతో వీరిని బదిలీ చేసిన తరువాత వచ్చే నెలలో భూవివాదాల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెవెన్యూ, పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్, మునిసిపల్ పరిపాలన, గ్రామ, వార్డు సచివాలయాలు, పౌరసరఫరాల శాఖ, మైనింగ్, జియాలజీ, అన్ని ఇంజినీరింగ్ శాఖలు, దేవాదాయ, రవాణ, పరిశ్రమలు, విద్యుత్, స్టాంప్పు, రిజిస్ట్రేషన్, కమర్షియల్ టాక్సు జిఎస్‌టి తదితర విభాగాలలో బదిలీల సందడి నెలకొంది. బదిలీ కోరుకునే వారు, అనివార్యంగా బదిలీ అయ్యే వారు తమకు అనుకూలమైన స్థానం కోసం ప్రయత్నిస్తున్నారు. సచివాలయాల ఉద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేస్తున్నారు.

ఉద్యోగుల బదిలీలపై ఇప్పటికే అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు దృష్టి సారించారు. వైసిపికి అనుకూలంగా ఉండి ప్రతిపక్షంలో ఉండగా తమను ఇబ్బంది పెట్టిన వారిని ఎట్టిప రిస్థితుల్లోనూ ఆయా స్థానాల్లో కొనసాగని వ్వరాదని జిల్లా అధికారులపై వత్తిడి తెస్తున్నా రు. అయితే గట్టుచప్పుడు కాకుండా వత్తిళ్లకు అవకాశం ఇవ్వకుండా పోలీసు శాఖలో ఐదేళ్ల పాటు ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న ఎఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లకు బదిలీ చేస్తూ జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన సిఫార్సులకు అవకాశం ఇవ్వలేదనే వాదన విన్పిస్తుంది. పంచాయతీ రాజ్‌శాఖకు సంబంధించి ఎంపిడివోలు, మండల, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీపై కసరత్తు జరుగుతోంది. ఎంపిడివోలు కూడా ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలతో బదిలీకి సన్నద్ధం అవుతున్నారని తెలిసింది. డిఆర్‌డిఎ పరిధిలో ఎపిఎం, డిపిఎంల బదిలీలపై రాజకీయ వత్తిడి ఎక్కువగా ఉందని తెలిసింది. రెవెన్యూ శాఖలో విఆర్‌వోలు, ఆర్‌ఐలు, తహశీల్దార్ల బదిలీ కూడా భారీగా జరిగే అవకాశం ఉంది.



రాజధాని అమరావతిలో పర్యటిస్తున్న మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ

పర్యాటక రాజధానిగా అమరావతి

- 300 ఎకరాల్లో సెంట్రల్‌పార్కు - 500 ఎకరాల్లో వాటర్ లేక్‌లు
- ప్రాజెక్టుల స్థితిగతులపై వచ్చేనెల మొదటి వారంలో నివేదికలు
- రాజధానిలో పర్యటించిన మంత్రి నారాయణ, ఎడిసి ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి

ప్రజాశక్తి - తుళ్లూరు

ప్రజా రాజధాని అమరావతిలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు బ్లూ - గ్రీన్ ప్రాజెక్టులతో ఆకర్షణీయమైన పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. శాఖమూరు, అనంతవరం, నీరుకొండ ప్రాంతాల్లో అందమైన రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టి పర్యాటకానికి కేంద్ర బిందువుగా తీర్చిదిద్దుతామన్నారు. అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఛైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థసారథితో కలిసి అమరావతిలో వెంకటపాలెం నర్సరీ, శాఖమూరు సెంట్రల్ పార్కులను మంత్రి నారాయణ శనివారం సందర్శించారు. అక్కడ పెంచుతున్న వివిధ రకాల మొక్కలను గురించి 2లో

సంతకం కోసం నేడు మాచర్లకు పిఆర్‌కె?

- షరతులతో కూడిన బెయిల్‌పై నెల్లూరు జైలు నుండి విడుదల
- మాచర్లకు రాకుండా నేరుగా బెంగళూరులకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే
- గతానుభవాల నేపథ్యంలో చర్చనీయాంశంగా ఆంక్షల అమలు

ప్రజాశక్తి - మాచర్ల



ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జరిగిన అల్లర్లు, దాడుల కేసులలో ఆరెస్టయిన వైసిపి మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హైకోర్టు మంజూరు చేసిన కండిషన్ బెయిల్‌పై శనివారం నెల్లూరు జైలు నుండి విడుదలయ్యారు. ఆయన మాచర్లకు వస్తారని ప్రచారమవగా ఆయన తన అనుచరులతో కలిసి బెంగళూరు వెళ్లినట్లు తెలిసింది.

ఎన్నికల రోజున రెంటచింతల మండలం పాలువాయి గేటు పోలింగ్ కేంద్రంలో ఇవిఎం ధ్వంసం కేసు, టిడిపి ఏజెంట్ శేషగిరిరావుపై దాడి కేసు, పోలింగ్ మరుసటి రోజు కారంపూడిలో అనుచరులతో కలిసి టిడిపి కార్యాలయంపై దాడి, సిఐని గాయపర్చిన కేసుల్లో రామకృష్ణారెడ్డి ప్రధాన నిందితునిగా ఉన్నారు. నాలుగు కేసులల్లోనే రెండు నెలలుగా రామకృష్ణారెడ్డి నెల్లూరు సబ్ జైలులో ఉన్నారు. షరతులో కూడిన బెయిల్‌పై విడుదలైన ఆయన నిబంధనల ప్రకారం సంతకాలు చేసేందుకు మాచర్ల నియోజకవర్గానికి ఆదివారం రావాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కేసుల విచారణాధికారిగా నరసరావుపేట డీఎస్పీ ఉన్నారు. ఆయనే గురజాలకు ఇన్‌ఛార్జి డీఎస్పీగానూ వ్యవహరిస్తుండడంతో గురజాల డీఎస్పీ కార్యాలయానికి లేదు కేసులు నమోదైన రెంటచింతల, కారంపూడి పోలీసుస్టేషన్లలో ఎక్కడో ఒకచోట సంతకాలు పెట్టే అవకాశం ఉందంటున్నారు. శాంతిభద్రతల సమస్యల తలెత్తే అవకాశం ఉందనుకుంటే జిల్లా ఎస్‌పి ఆదేశాలతో జిల్లా కేంద్రమైన నర్సరావుపేటలో సంతకాలు చేయించే అవకాశం ఉండవచ్చునని తెలిసింది. జైలు నుండి విడుదలైన రామకృష్ణారెడ్డి ముందుగా మాచర్లకు వస్తున్నారని మాచర్ల పట్టణంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. చుట్టు ప్రక్కల నుండి 30 సిబ్బంది, 10 మంది 2లో

ఘనంగా విజ్ఞాన్ యూనివర్సిటీ స్నాతకోత్సవం



విజ్ఞాన్ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న జస్టిస్ పమిడి ఘంటం శ్రీనరసింహం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 12వ స్నాతకోత్సవాన్ని శనివారం వర్సిటీ ప్రాంగణంలో వైభవంగా నిర్వహించారు. డిగ్రీలు చేతబట్టుకున్న వేళ విద్యార్థుల సంబరం అంబరాన్ని అంటింది. కేరింతలతో వర్సిటీ ప్రాంగణమంతా హోరెత్తింది. నాలుగేళ్ల తమ అనుభవాలను విద్యార్థులు ఒకరికొకరు పంచుకున్నారు. తరగతి గదుల్లో గడిపిన క్షణాలను, విశ్వవిద్యాలయంతో తాము పెంచుకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సెల్ఫీల్లో తమ సంతోషాన్ని బంధించారు. దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిన బూనారు. విద్యార్థులంతా తలపాగా, కండువా వేసుకుని అచ్చతెలుగు పెద్ద మనుషుల్లా కనిపించారు. సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబిస్తూనే సాంకేతిక విద్యా సర్టిఫికెట్లను పొందారు. హైదరాబాద్‌లోని ఎస్ఇసి ఇండస్ట్రీస్ ఫౌండర్ అండ్ చైర్మన్ దొంతినేని శేషగిరిరావు, హైదరాబాద్‌లోని లోకేష్ మెషీన్స్ ఫౌండర్ ముల్లపూడి లోకేశ్వరరావు, ఇండియన్ కంపోజర్ అండ్ సింగర్ సాలూరి కోటేశ్వరరావు (కోటి)లకు గౌరవ డాక్టరేట్‌లు ప్రదానం చేశారు. సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ 12వ స్నాతకోత్సవం సందర్భంగా మొత్తం 1539 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశామని తెలిపారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, విజ్ఞాన్స్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు కీలక ఉపన్యాసాలు చేశారు. యువత సంకల్పం అన్నింటి కంటే బలమైనదని, యువత సరైన దిశలో గమ్యం వైపు పయనిస్తే దేశం బలమైన భారత్‌గా ఎదుగుతుందని అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, బోర్డు ఆఫ్ మేనేజిమెంట్ సభ్యులు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అధికారం ఉన్నా వీడని నైరాశ్యం

8లో



డీవీసీలో ఐసీయూను ప్రారంభించిన మంత్రి

ప్రజాశక్తి - చేబ్రోలు

వడ్లమూడిలోని ధూళిపాళ్ల వీరయ్య చౌదరి (డివిసి) హాస్పిటల్ రీసెర్చ్ సెంటర్ వార్షికోత్సవం సందర్భంగా కార్డియాక్ ఐసీయూను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో సదుపాయాలను, వైద్యసేవలను అభినందించారు. ధూళిపాళ్ల వీరయ్య చౌదరి సంగం డెయిరీ చైర్మన్‌గా, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రిగా ప్రజలకు ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. సంగం డెయిరీ నాణ్యమైన ఉత్పత్తులతో చాలా విలువైన బ్రాండ్‌గా ఉద్భవించిందని చెప్పారు. ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కోవిడ్ సమయంలో కూడా ప్రజలకు వైద్యం అందించామన్న సంతృప్తి మిగిలిందని చెప్పారు. వైద్యారోగ్య వ్యవస్థ బాగుంటేనే వేల కుటుంబాలు బాగుంటాయని అన్నారు.



భవన నిర్మాణ సెస్సు వసూలు వివరాల కోసం వినతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అమలు చేయాల్సిన సంక్షేమ పథకాలకు అమలు చేయడం లేదని భవన నిర్మాణ ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్షులు అవ్వారు ప్రసాద్‌రావు అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుకు నిధులు పట్టణంలోని భవన నిర్మాణ యజమానుల నుండి ఏ మేరకు వసూలు చేశారు? కార్మిక శాఖకు ఎంత జమ చేశారు? అనే వివరాలను తెలియపరచాలని కోరుతూ సమాచార హక్కు చట్టం ద్వారా మున్సిపల్ ఆర్‌ఒ అప్పారావుకు శనివారం భవన నిర్మాణ కార్మికులు పిటిషన్ అందజేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పుట్టా నరసింహారావు, మొగల్ ఆదం సాహెబ్, కాశయ్య, శ్రీను, నరసింహారావు పాల్గొన్నారు.

బాలికోన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - తెనాలి

ఈ ఏడాది జూలై నుంచి అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలను గౌరవించాలని ప్రముఖ న్యాయవాది ఖాదర్ హుస్సేన్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞన సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. చట్టాలను గౌరవించాలని, న్యాయ సేవలకు సంబందించి హక్కులు, బాధ్యతలను వివరించారు. పారా లీగల్ వాలంటీర్ హజ్గర్ అలీ మాట్లాడుతూ భారత ప్రభుత్వం, మంత్రి మండలి, లోకసభ, రాజ్యసభ, ప్రధాన మంత్రి, రాష్ట్రపతి ఎన్నిక విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం సుందరరావు, ఉపాధ్యాయులు మస్తాన్‌రావు, నాగేశ్వరావు, మండల లీగల్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.





వైద్యవిద్యార్థిని హత్యాచారంపై

ఎఎం రెడ్డి ఫార్మసీ విద్యార్థుల నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కోల్‌కతా ఆర్జికర్ మెడికల్ కాలేజీలో ఘటనపై నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం గ్రామ పరిధిలో గల ఎఎం రెడ్డి స్మారక ఫార్మసీ కళాశాల విద్యార్థులు నరసరావుపేట పట్టణంలో శనివారం నిరసన ర్యాలీ చేశారు. వినుకొండ రోడ్డులోని బస్‌స్టాండ్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు సాగిన ప్రదర్శనలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణరావు మాట్లాడుతూ దేశమంతా ఉలిక్కిపడేలా ఎంతో పైశాచికంగా జరిగిన ఈ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాల డీన్ డాక్టర్ పి.లక్ష్మీ సురేఖ మాట్లాడుతూ 78 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో ఇటువంటి దాడులు సిగ్గు చేటన్నారు. పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా కొంత వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నిత్యం దేశంలో మహిళలపై దాడులు జరుగుతున్నాయన్నారు. మహిళలపై దాడుల జరగకుండా నూతన చట్టాలు తెచ్చి పటిష్టంగా అమలు చేయాలని కోరారు.

ఎంవి రెడ్డి హాస్పిటల్ ఉచిత కంటి వైద్య శిబిరం



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కంటి వ్యాధుల నిర్లక్ష్యం తగదని నరసరావుపేట ఎంవి రెడ్డి కంటి హాస్పిటల్ వైద్యులు ఎల్.సృజన అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ఇంటిగ్రేటెడ్ హైస్కూల్‌లో 100 మందికిపైగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు శనివారం ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎల్.సృజన మాట్లాడుతూ ప్రస్తుతం ఫోలిక్యులర్ కండ్లకలక కేసుల పెరుగుదల ఎక్కువగా ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫ్లూ కాలంగా పిలువబడే వర్షాకాలం వైరస్, బాక్టీరియా ఇన్ఫెక్షన్లు సులభంగా సోకుతాయన్నారు. ఈ ఇన్ఫెక్షన్లు అంటు వ్యాధులని, ఒకరి నుండి మరొకరికి తేలికగా సంక్రమిస్తాయని వివరించారు. ఇన్ఫెక్షన్లు సోకిన వారికి వ్యక్తిగత సంరక్షణ అవసరమన్నారు. సెల్‌ఫోన్, కంప్యూటర్, టీవీలు ఎక్కువ చూసిన చిన్నారుల్లో మానసిక ఎదుగుల లోపించడంతో పాటు చిన్న వయసులోనే కంటి సంబంధిత వ్యాధులకు గురవుతున్నారన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను శరీరం అలిసేలా బయట ఆటలు ఆడేలా ప్రోత్సహించాలన్నారు. గులాబి రంగు కండ్ల కలకలు ప్రజలను కలవరపరిస్తున్నాయని, బయపడాల్సిన అవసరం లేకున్నా అవి సోకకుండా జాగ్రత్త పడాలని చెప్పారు. అడెనో వైరస్ వంటి ప్రత్యేక వైరస్‌ల సమూహం కారణంగా వచ్చే ఫోలిక్యులర్ కండ్లకలక ఈ కాలంలో అత్యంత సాధారణంగా కనబడుతుందని, కండ్ల కలకలు వచ్చినవారు కంటి వైద్యులను సంప్రదించి సరైన చికిత్స పొందాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన డాక్టర్ సృజనను హైస్కూల్ కరస్పాండెంట్ ఇంద్రాణి, సిబ్బంది సత్కరించారు.

పర్యాటక రాజధానిగా అమరావతి

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్మీపార్థసారథిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శాఖమూరు సెంట్రల్ పార్కులోని ప్రగతి రిసార్టులో మీడియాతో మంత్రి మాట్లాడారు. నార్మన్ ఫోస్టర్ అండ్ పర్టనర్ (లండన్), సింగపూర్‌కు చెందిన నిష్ణాతులతో అమరావతి మాస్టర్‌ప్లాన్ రూపొందించామని, అమరావతిలో చక్కటి వాతావరణాన్ని అందించే ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధతో బ్లూ అండ్ గ్రీన్ మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయించారని చెప్పారు. హైదరాబాద్ మహా నగరాన్ని పచ్చదనంతో అద్భుతంగా తీర్చిదిద్దిన సీనియర్ అధికారి లక్ష్మీపార్థసారథికి అమరావతిలో పచ్చదనం ప్రాజెక్టుల అభివృద్ధి బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిందన్నారు. ఎడిసి నేతృత్వంలో 300 ఎకరాల్లో నిర్మాణంలో ఉన్న శాఖమూరు సెంట్రల్ పార్కులో బోటింగ్‌కు అనువుగా 50 ఎకరాల్లో రిజర్వాయర్‌ను నిర్మించి పర్యాటక కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. దీనితోపాటుగా నీరుకొండలో 500 ఎకరాల్లో వాటర్ లేక్‌లకు సన్నద్ధం చేస్తున్నామన్నారు. కొండవీటివాగు, పాలవాగు గ్రావిటీ కెనాల్ వంటి నీటి ప్రాజెక్టుల వెంబడి 20-30 మీటర్ల వెడల్పుతో బఫర్ జోన్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. 35 ఎకరాల్లో అనంతవరం ఉద్యానవనం, రాష్ట్ర సచివాలయం ముంగిట 21 ఎకరాల్లో మల్కాపురం పార్కును ఏర్పాటు చేసి ఇందులో విభిన్న రకాల ఔషధ గుణాలు కలిగిన వివిధ రకాల మొక్కలను పెంచుతామని చెప్పారు.

360 కిలోమీటర్ల మేర రాజధాని రవాణా వ్యవస్థ

అమరావతిలో ఎడిసి ఆధ్వర్యంలో 360 కిలోమీటర్ల మేర సువిశాలమైన రవాణా వ్యవస్థ అందుబాటులోకి రానుందని మంత్రి నారాయణ చెప్పారు. రూ.41 వేల కోట్లతో ముఖ్యమైన మౌలిక సదుపాయాలైన వాటర్ లైన్లు, ఐసిటి, విద్యుత్, గ్యాస్, స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లు, నీటిపారుదల వ్యవస్థల నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో రూ.5,100 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం రాజధానిపై మూడు ముక్కలాటాడటంతో ముళ్లకంపతో నిండిపోయిందని, రూ.36 కోట్లతో కంప తొలగింపు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామని అన్నారు. మరో నెల రోజుల్లో ఈ పనులు పూర్తిచేస్తామన్నారు.

సెప్టెంబరు మొదటి వారంలో ఐఐటి నివేదికలు

రాజధాని అమరాతిలో గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన ప్రాజెక్టుల స్థితిగతులపై మద్రాస్ ఐఐటి, హైదరాబాద్ ఐఐటి వారు పర్యటించి క్షేత్రస్థాయిలో నివేదికను వచ్చేనెల మొదటి వారంలో రాష్ట్ర ప్రభుత్వానికి అందించనున్నారని మంత్రి చెప్పారు. ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారం పూర్వ ప్రాజెక్టు అంచనాలు, నేటి నిర్మాణ అంచనాలను సిఆర్‌డిఎ అథారిటీకి నివేదించి ఆపై మంత్రివర్గానికి పంపనున్నట్లు స్పష్టం తెలిపారు. మంత్రివెంట అమరావతి అభివృద్ధి సంస్థ గ్రీనరీ అధికారులు పాల్గొన్నారు.

సంతకం కోసం నేడు మాచర్లకు పిఆర్‌కె?

(మొదటి పేజీ తరువాయి)

పోలీసు అధికారులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయన బెంగళూరు వెళ్లారని తెలిసి బందోబస్తును ఉపసంహరించారు.

అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా వైసిపికి చెందినవారు ఎదురుపడి కవ్వింపు చర్యలకు పాల్పడటంతో ఘర్షణ తలెత్తింది. అప్పుడు బ్రహ్మానందరెడ్డి, అతని అనుచరులపై హత్యయత్నం కేసులు నమోదయ్యాయి. ఆ కేసుల్లో షరతులతో కూడిన ముందస్తు బెయిల్ తెచ్చుకున్న బ్రహ్మానందరెడ్డి మాచర్ల పోలీస్‌సేష్టన్‌లో సంతకాలు చేసేందుకు వస్తుండగా అప్పటి పోలీసులు అనేక అంక్షలతో వారిని ఇబ్బంది పెట్టారు. నెలల తరబడి, ఊరికి దూరంగా ఉండి సంతకాలు పెట్టేందుకు వస్తున్న బ్రహ్మానందరెడ్డిని కలిసేందుకు పెద్దఎత్తున తరలివచ్చే అనుచరులను అడ్డుకునేందుకు పోలీసులు తీవ్ర అంక్షలు విధించారు. నాడు గుంటూరులో నివాసం ఉండే బ్రహ్మానందరెడ్డి మాచర్ల పోలీస్‌స్టేషన్‌లో సంతకాలు చేసేందుకు బస్సులో తన అనుచరులతో కలిసి వస్తుండగా బస్సు వద్దకు మీడియాను సెత్తం అనుమతించలేదు. బ్రహ్మానందరెడ్డిని చూసేందుకు వచ్చిన వారిని లాఠీ చార్జీ చేసి పంపించారు. పార్టీ శ్రేణులను సైతం కలవకుండా బ్రహ్మానందరెడ్డిని నియంత్రించారు. బ్రహ్మానందరెడ్డిని కలవాలనుకునేవారు గుంటూరు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా రివర్స్ అయిన నేపథ్యంలో రామకృష్ణారెడ్డి మాచర్లకు వస్తే ఎలాంటి ఆంక్షలు ఉంటాయనేది చర్చనీయాంశంగా మారింది.

పట్టణాల్లో పేదరిక నిర్మూలన లక్ష్యాలపై సదస్సు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : రాష్ట్రంలోని అన్ని పట్టణ ప్రాంతాల్లో పేదరికాన్ని నిర్మూలించేందుకు అందరూ ముందుకి రావాలని మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక కెఎల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన వికసిత్ ఏపీ-2047 అనే కార్యక్రమంలో ఆయన రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాల్సిన ప్రణాళికలు లక్ష్యాలను కొన్ని మార్గదర్శకాలను శనివారం అన్ని జిల్లాల ప్రాజెక్ట్ డైరెక్టర్లకు, మెప్మా సిబ్బందికి రాష్ట్ర స్థాయి సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సులో భాగంగా మిషన్ డైరెక్టర్ మాట్లాడుతూ ఎన్‌బిఎఫ్ సర్వే గురించి ఓఎన్డిసి (ఓఎన్‌డిసి) తదుపరి చర్యల గురించి కొన్ని నిర్దిష్టమైన సూచనలను చేశారు. స్వయం సహాయక సంఘాలు జిఎస్టి కలిగి ఉండి ఈ-కామర్స్ ద్వారా వారి ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడానికి ఈఓఎన్‌డిసి ప్లాట్‌ఫారం ఎలా ఉపయోగపడుతుందో దానికి మెప్మా స్టాఫ్ ఏయే కార్యాచరణ చేయాలో తగిన ఆదేశాలిచ్చారు. సిఎం చంద్రబాబు, మున్సిపల్ మంత్రి నారాయణ సూచనల మేరకు ఎన్బిఎఫ్, ఓయెన్‌డిసి కార్యక్రమాలను, వికసిత్- 2047 లక్ష్యాలను వివరించారు.



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కృష్ణవేణి విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉమ్మడి గుంటూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత శుక్రవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన పరుగు పోటీల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. క్రీడాకారులను చిలకలూరిపేట రోడ్డులోని కళాశాలలో ప్రత్యేకంగా అభినందించారు. 800 మీటర్లు పరుగు పందెంలో జి.ధర్మతేజ బంగారు పతకం, 10 కిలోమీటర్ల పరుగులో పి.శివకృష్ణ రజత పతకం సాధించారని, వచ్చేనెల 14 , 15 తేదీల్లో వర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఈదర ఆదిబాబు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు

ప్రజాశక్తి - పెదనందిపాడు : బాలలను పనిలో పెట్టుకోవడం నేరమని కార్మిక శాఖాధికారి కె.సాంబశివరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన పెదనందిపాడులోని లావు వారి చెరువు వద్ద ఉన్న ఒక మెకానిక్ షెడ్డులో వరగానికి చెందిన బాల కార్మికుడు పని చేస్తూ ఉండడంతో అధికారులు శనివారం తనిఖీలు చేసి బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈనెల ఒకటో తేదీ నుండి 31వ తేదీ వరకూ బాల కార్మికుల నిరోధం కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఎఎస్ఐ లక్ష్మీ, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ దేవసేన, సమీర్ పాల్గొన్నారు.

ట్రైసైకిల్ వితరణ

ప్రజాశక్తి -పొన్నూరు : పట్టణంలోని 8వ వార్డు క్యాబిన్‌పేటకు చెందిన వికలాంగురాలు నాంచారమ్మకు రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు ఆధ్వర్యంలో ఈగల్ రెస్టారెంట్ అధినేత వి.ఫణి కుమార్ సహకారంతో రూ.8 వేలతో సమకూర్చిన ట్రై సైకిల్‌ను శనివారం అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రవిరాకేష్ దేవ్, ఎన్.బాలకృష్ణ, సభ్యులు బి.శ్రీనివాసరావు, శివరామకృష్ణ, పాల్గొన్నారు.



ఎస్ఐను కలిసిన ఎస్టిసెల్ నాయకులు

ప్రజాశక్తి - వినుకొండ

సాధారణ బదిలీలలో భాగంగా బొల్లాపల్లి పోలీస్ స్టేషన్ సబ్ఇన్స్పెక్టర్గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఏ.బాలకృష్ణను బొల్లాపల్లి మండలం గండిగనుముల గ్రామ ఎస్టిసెల్, టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బొల్లాపల్లి పోలీస్ స్టేషన్కు నూతన ఎస్ఐగా వచ్చినందుకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ బాలకృష్ణ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు కాపాడేందుకు మండల ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఎస్ఐను కలిసినవారిలో గ్రామ సర్పంచ్ వి.శ్రీను నాయక్, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షులు వి.కోట నాయక్, గ్రామపెద్దలు వి కోట నాయక్, వి.మంత్రు నాయక్, వి.బాలు నాయక్, స్టూడియో గోపి నాయక్, శ్రీను నాయక్ రూప్లా నాయక్, కార్యకర్తలు వి.బాల నాయక్,

రైల్వే ట్రాక్పై గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి - తాడేపల్లి



కృష్ణా కెనాల్ జంక్షన్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని యువకుని మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. సుమారు 30 సంవత్సరాల యువకుడు ట్రైన్లో వెళ్తూ ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుని ఒంటిపై లైటు స్కైబ్లూ కలర్ షర్టు, బిస్కెట్ రంగు ప్యాంటు ఉన్నాయి. మృతదేహాన్ని గుంటూరు జిజిహెచ్కు తరలించి రైల్వే సిఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్



పట్టణంలో ఓ ద్విచక్రవాహనంపై పెట్రోల్ పోసి దగ్ధం చేసిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలకు.. సత్తెనపల్లి పట్టణంలోని యాగాది కాలనీ సమీపంలో తోకలసాంబయ్యకు చెందిన బైకును దుండగులు పెట్రోల్ పోసి తగలబెట్టారు. ఈ ఘటనపై బాధితుడు సాంబయ్య పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. భట్టు తిరుపాల్, అతని కుమారుడు సంపత్లు తగులబెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. పట్టణ సిఐ బ్రహ్మయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

పందెం కోళ్లు దొంగతనం

ప్రజాశక్తి-తాడేపల్లి

మహానాడులో రూ.లక్షలు ఖరీదైన 22 పందెం కోళ్లు దొంగతనానికి గురయ్యాయి. చీరాలకు చెందిన చెడ్డీ గ్యాంగ్ ఈ దొంగతనానికి పాల్పడినట్లు తెలుస్తుంది. చోరీకి గురైన కోడిపుంజులు లక్షలాది రూపాయలు ఖరీదు చేయడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. తాడేపల్లి సిఐ కల్యాణరాజు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

విద్యుత్ షాక్ తగిలి కార్మికుడికి గాయాలు

ప్రజాశక్తి-మాచర్ల : పొట్టకూటి కోసం కలకత్తా నుండి మాచర్లకు వచ్చిన ఓ యువకుడు విద్యుత్ షాకుకు గురైన ఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది. కలకత్తాకు చెందిన ప్రకాష్ దేవ్ అనే యువకుడు మాచర్ల లోని రింగ్ రోడ్డు సమీపంలో బోస్ ఇంటి పక్కన ఉన్న ఎత్తయిన విద్యుత్ స్తంభానికి సిల్వర్ పెయింట్ వేస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి 30 అడుగుల ఎత్తు నుండి కింద పడ్డాడు. దీంతో యువకుడు తలకు తీవ్ర గాయాలు అవటంతో పాటు శరీరమంతా కాలి బొబ్బలు వచ్చాయి. కాంట్రాక్టర్లు హుటాహుటిన మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో క్షతగాత్రుని నరసరావుపేట జిబిఆర్ హాస్పిటల్కు తరలించారు. అక్కడ పరీక్షలు జరిపిన అనంతరం ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపినట్లు సమాచారం. అసలు విద్యుత్ సరఫరా నిలిపివేయకుండా పనులు చేయించిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. హైవే రోడ్డు పనులు చేసే కార్మికులకు ఇన్సూరెన్స్లు కట్టకుండానే పనులు చేయించుకున్నట్టు సమాచారం. పనులు చేసే సమయంలో ఎవరికైనా జరగరాని ప్రమాదం జరిగితే ప్రభుత్వం నుండి ఎటువంటి ఆర్థిక సాయం అందించే పరిస్థితి లేదు. సంబంధిత అధికారులు చొరవచూపి కార్మికుల పక్షాన న్యాయం చేయగలరని పలువురు కార్మికులు కోరుతున్నారు.

పట్టణ సిఐగా బ్రహ్మయ్య

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్



సత్తెనపల్లి పట్టణ సిఐగా బి.బ్రహ్మయ్య శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయన తాడేపల్లి సిఐగా పని చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇసుక టోకెన్లకు డ్రైవర్ల క్యూ

ప్రజాశక్తి - తుళ్లూరు

ఇసుక టోకెన్ల కోసం లారీ, ట్రాక్టర్ డ్రైవర్లు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బారులు తీరారు. మండలంలోని లింగాయపాలెం, తాళ్లాయపాలెం ఇసుక స్టాక్ పాయింట్ల ఇసుకను లోడింగ్ చేయించుకునేందుకు శనివారం నుంచి తహశీల్దార్ కార్యాలయంలో టోకెన్లు ఇస్తున్నారు. దీంతో ట్రాక్టర్, లారీ డ్రైవర్లులు క్యూ కట్టారు.

ఘనంగా ముందస్తు కృష్ణాష్టమివేడుక

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జునసాగర్ విజయపురిసౌత్ సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పాఠశాల హెచ్ఎం సుజిత ముఖ్యఅతిథిగా హాజరై సభాధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిలకలూరిపేట: మోడరన్ విద్యా సంస్థల ఛైర్మన్ చేబ్రోలు మహేష్ శనివారం అన్నారు. సోమవారం శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా శనివా రం స్థానిక మోడరన్ స్టెల్లార్ స్కూల్లో ముందస్తు శ్రీకష్ణాష్టమి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మొదటగా మోడరన్ విద్యాసంస్థల ఛైర్మన్ చేబ్రోలు మహేష్ పూజ చేసిన ప్రారంభించారు. ఈ వేడుకలలో చిన్నారులందరూ చిన్ని కృష్ణుడు, యశోద, గోపికల వేషధారణలలో అలరించారు. ఆట, పాటలు, ఉట్టి కొట్టే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మండల ప్రజా పరిషత్, దుగ్గిరాల

టెండరు నోటీసు నెం. 05/2024/బి, **తేది : 24-8-2024**

దుగ్గిరాల మండల ప్రజా పరిషత్ సాధారణ నిధులు, మహిళా శిశు సంక్షేమ మరియు 15వ ఆర్థిక నిధులతో ఈ దిగువ చూపబడిన పనులు చేయుటకు రిజిష్టర్ అయిన కాంట్రాక్టర్ల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండరు నియమ నిబంధనలకు మరియు ఇతర వివరములకు ఈ దిగువ సంతకం దారుని కార్యాలయపు పనివేళల యందు సంప్రదించగలరు.

మొత్తము పనులు : 12 **పనుల అంచనా విలువ : రూ. 43.50 లక్షలు**

టెండరు షెడ్యూల్స్ కొరకు దరఖాస్తు స్వీకరించు తేది : 24-8-2024 నుండి 30-8-2024 మధ్యాహ్నం 1-00 వరకు

సీల్డు టెండరు షెడ్యూల్స్ స్వీకరించు తేది : 30-8-2024 సాయంత్రం 4-00 గం.ల వరకు

సీల్డు టెండర్లు తెరచు తేది : 30-8-2024 సాయంత్రం 4-30 గం.లకు

ఇట్లు

సం/- మండల పరిషత్ అభివృద్ధి అధికారి,
మండల ప్రజా పరిషత్, దుగ్గిరాల.

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), నరసరావుపేట

I.A No.258/2022 IN O.S. No. 37/2020

బిట్వీన్:-
గోరంట్ల సాయి ప్రసన్న ... పిటీషనర్ / వాది
Vs
గోరంట్ల రామాంజనేయులు వగైరాలు .....రెస్పాండెంట్స్/ప్రతివాదులు

To,

R14) బొగల వీరాంధ్ర హనుమాన్ రెడ్డి S/o వెంకటేశ్వరరెడ్డి, నాగులవరం గ్రామం, వినుకొండ మండలం,పల్నాడు జిల్లా.
R15) నడిగం శ్రీనివాసరావు S/o కొండయ్య, గుండాలపాడు గ్రామం, ఫిరంగిపురం మండలం,గుంటూరు జిల్లా.
R16) కందుల నాగేశ్వరరావు S/o వెంకట స్వామి, కుందురువారిపాలెం, ముప్పాళ్ల మండలం, పల్నాడు జిల్లా.
R18) గోకనబోయిన వెంకటరమణ W/o లేటు ఆంజనేయులు, జెండా చెట్టు బజారు, పసుమర్రు గ్రామం, చిలకలూరిపేట మండలం,పల్నాడు జిల్లా.
R19) రావెళ్ళ సరోజ W/o లేటు నాగేశ్వరరావు, నవోదయనగర్, నరసరావుపేట టౌన్ & మండలం, పల్నాడు జిల్లా.
R20) రావెళ్ళ నాగేంద్ర W/o లేటు నాగేశ్వరరావు, నవోదయనగర్, నరసరావుపేట టౌన్ & మండలం, పల్నాడు జిల్లా.
R21) రావెళ్ళ నిఖిల్ S/o లేటు నాగేశ్వరరావు, నవోదయనగర్, నరసరావుపేట టౌన్ & మండలం, పల్నాడు జిల్లా.
R22) రావెళ్ళ నిఖిత D/o లేటు నాగేశ్వరరావు, నవోదయనగర్, నరసరావుపేట టౌన్ & మండలం, పల్నాడు జిల్లా.
R24) చింతిరాల సుధాకరరావు S/o లేటు వెంకట్రావు, కారంపూడి రోడ్డు, వినుకొండ పట్టణం, పల్నాడు జిల్లా.
R26) దోసపాటి లక్ష్మి W/o రాధాకృష్ణ D/o లేటు చింతిరాల వెంకట్రావు, తల్లిపిల్లల హాస్పిటల్ రోడ్డు, కొత్తపేట, వినుకొండ టౌన్ & మండలం,పల్నాడు జిల్లా.
R27) కందుల నాగేంద్ర S/o లేటు నాగేశ్వరరావు, కందులవారిపాలెం గ్రామము, ముప్పాళ్ళ మండలం.
R28) కందుల హనుమంతరావు S/o లేటు నాగేశ్వరరావు, కందులవారిపాలెం గ్రామము, ముప్పాళ్ళ మండలం,పల్నాడు జిల్లా.
R29) కందుల మురళీ మోహన్ S/o లేటు నాగేశ్వరరావు, కుందురువారిపాలెం గ్రామం ముప్పాళ్ళ మండలం,పల్నాడు జిల్లా.
R30) కందుల రమాదేవి D/o లేటు నాగేశ్వరరావు, కుందురువారిపాలెం గ్రామం, ముప్పాళ్ళ మండలం, పల్నాడు జిల్లా.

పై నెంబరు దావాలో ఐ.ఎ.నెం. 258/2022 నెంబరున పిటీషన్ దాఖలు చేయగా పై కోర్టు వారి నుండి మీకు నోటీసులు జారీ చేయగా మీరు నోటీసులు తీసుకొని కారణముగా ఈ పేపర్ ప్రకటన ద్వారా ఈ యొక్క నోటీసు నిమిత్తము ది.2-09-2024 కు వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా తేదీన ఉదయం 10:30 ని.లకు మీరు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు విచారించి చట్ట ప్రకారం తీర్మానించ బడునని తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం

వాయిదా: 2-09-2024 **ఇట్లు.**

శ్రీ బి.అనిల్ కుమార్,
పిటీషనర్ తరుపు అడ్వకేట్,
నరసరావుపేట, పల్నాడు జిల్లా.

IN THE COURT OF THE MACT CUM XXIV Addl Chief Judge City Civil Court AT: HYDERABAD, TELANGANA

O.P.NO 102 OF 2022

Between:
Madamonj Ravinder & Another .... Petitioner
AND
M/S. Zeem car India Pvt Ltd., ... Respondents

To..
Avvaru Naveen, S/O: Srinivas Rao Age: 25 Years, R/e: D.NO:8-165, Karivepakulavari Street, Mangalagiri Town, Guntur District.Pin 522503...R3

Whereas the above named Petitioners have filed the above O.P. against you and another for grant of compensation under the M. V Act.

Please take notice that the above O.P. stands posted to **04-09-2024** for your appearance, you are required to appear before Hon'ble Court at 10: 30 am on the above date either in person or through an advocate, failing which the matter will be decided exparte

// BY ORDER OF THE COURT//
C. SATISH KUMAR REDDY
ADVOCATE
Plot No: 36/1#3-125/36
Shanthinagar Colony,
Uppal, Hyderabad-39

GENERAL NOTICE

IN THE COURT OF THE ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION):: TENALI

I.P No: 25 /2024

BETWEEN :
Venigalla Veda Viswa, S/o.Narahari Swapna Kesava Rao,R/o.D.No.2-105-1, Donepudi, Kolluru Mandal, Bapatla Dist. ....Petitioner
And
1)Murikipudi Sukesh, S/o.Subrah Manyam, R/o.D.No.6-41,Duggirala, Guntur Dt., 2)Ancha Naga Bharagavi,D/o. Srinivasa Rao, R/o.D.No.1-30-52, Ward No.7, DVC Colony, Ponnuru, Guntur Dt.,3) Thalabathula Nuthana Narayana, S/o. Gopi Krishna Murthy, R/o.D.No.7-4-47, Bhavanam Vari Street, Ganganamma Peta, Tenali, Guntur Dt., 4)Lal Syed Ahammed, S/o.Hussain,R/o.D.No.7-25-28, Gananammapeta, Tenali, Guntur Dt., 5)Venigalla Sai Prakash,S/o.Sai Sudhakar, R/o.Opp. Panchayat Office, Donepudi Village, Kolluru Mandal, Bapatla Dt. ....Respondents

పైనెంబరు IP లోని పిటీషనర్ తనను ఇన్ సాల్వెంటుగా డిక్లేర్చేయమని కోరుచు పిటీషన్ దాఖలుచేయగా సదరు పిటీషన్పై ఎవరికైన అభ్యం తరములు ఉంటే తెలుపుకోనవలసినదిగా శ్రీ కోర్టు వారు జనరల్నోటీసు నిమిత్తం **ది:04-09-2024కి** వాయిదావేసినారు. కావున ఆరోజున **ఉ॥గం॥ 10:30ని॥**లకు పైకోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీతరపు వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్ష మున తీర్మానించబడును. **(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు).**

వాయిదా తేదీ: 04-09-2024.

P. SRIRAM PRASAD,
Advocate for Petitioner, Tenali,

దావా సమన్లు

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE(JUNIOR DIVISION) : GUNTUR

O.S. No. 82 / 2020

Between:
Canara Bank, Chandramoulinagar, rep. by its Manager. ...Plaintiff
And
Mandala Pamula Reddy, S/o. Venkata Subba Reddy. ...Defendant

To,
Mandala Pamula Reddy, S/o. Venkata Subba Reddy, R/o. Door No.6-16-15, 16/2 Arundelpet Guntur City, Mandal and Dt.

పైనెంబరు దావాలో ప్రతివాదికి సమన్లు నిమిత్తం పేపరు పబ్లికేషన్ద్వారా తెలియజేయమని కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చి యున్నారు. కావున పైన ఉదహరించిన ప్రతివాది **ది.03-09-2024**న **ఉ॥గం॥10-30ని॥**లకు పైకోర్టువారిఎదుట హాజరై తమకుగల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

GADE ERUKALA REDDY,
Advocate for Plaintiff, Brodipet,
Guntur,Cell: 98483 49516

దావా సమన్లు

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE(JUNIOR DIVISION) : GUNTUR

O.S. No. 842 / 2020

Between:
Canara Bank, Gorantla Branch, Guntur rep. by its Manager. ...Plaintiff
And
Pittala Jaya Lakshmi Proprietor: Lakshmi Chaitanya General Merchant. ...Defendant

To,
Pittala Jaya Lakshmi Proprietor: Lakshmi Chaitanya General Merchant, W/o. Arjuna, R/o. Door No. 7-6-920/A, 1st Line, Vengala Rao Nagar, Guntur City, Guntur District.

పైనెంబరు దావాలో ప్రతివాదికి సమన్లు నిమిత్తం పేపరు పబ్లికేషన్ద్వారా తెలియజేయమని కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున పైన ఉదహరించిన ప్రతివాది **ది.03-09-2024**న **ఉ॥గం॥10-30ని॥**లకు పైకోర్టువారిఎదుట హాజరై తమకుగల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీపరోక్షమున తీర్మానించబడును.

GADE ERUKALA REDDY,
Advocate for Plaintiff, Brodipet,
Guntur, Cell: 98483 49516

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సి విల్ జడ్జి గారి కోర్టులో

O.S.No.7/2019

యాలమూరి భాస్కరరెడ్డి ..... వాది
V/s
1 విజయసాయి పెర్టిలైజర్స్ నిర్సరావుపేట రి.టై. దాని ప్రొప్రయిటర్, మద్ది శ్రీనివాసరావు.
2. మద్ది శ్రీనివాసరావు .....ప్రతివాదులు

టు:

ప్రతివాదులు

1.విజయసాయి పెర్టిలైజర్స్ నర్సరావుపేట రి.టై. దాని ప్రొప్రయిటర్, మద్ది శ్రీనివాసరావు, S/o వెంకట నరసింహం, వినుకొండరోడ్డు, నియర్ మార్కెట్, ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రక్కన, నర్సరావుపేట టౌన్ & మండలము, పూర్వం గుంటూరు జిల్లా. ప్రస్తుతం పల్నాడు జిల్లా
2.మద్ది శ్రీనివాసరావు S/o వెంకటనరసింహం, ప్రొప్రయిటర్, విజయసాయి పెర్టిలైజర్స్ నర్సరావుపేట, వినుకొండ రోడ్డు, నియర్ మార్కెట్, ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రక్కన, నర్సరావుపేటటౌన్ & మండలము, పూర్వం గుంటూరు జిల్లా. ప్రస్తుతం పల్నాడు జిల్లా.

పైనంబరు దావాలో మీకు ఎన్నిసార్లు దావా సమనులు/ నోటీసులు పంపినప్పటికి మీరు దురుద్దేశ్యపూర్వకముగా తీసుకొనక తిరిగి పంపుచున్నందువలన మీకు పై దావా లో నోటీసును ఈ ప్రకటన ద్వారా కోర్టువారు జారీ చేసి మీ హాజరు నిమిత్తం ఈదావాను తేది. 03-10-2024 నకు వాయిదా వేశారు. కావున మీరు ఆ తేదిన ఉదయం గం.10-30ని.లకు పై కోర్టువారి ఏదుట స్వయముగా గాని వకీలు ద్వారాగాని హాజరయి పై పిటిషన్ లో మీ ఆక్షేపణలను తెలియజేయవలెను. లేని ఏడల పై పిటిషన్ ను మీ పరోక్షమందు తీర్మానించదరని తెలియ జేయడమయినది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //

వజ్రాల అంజిరెడ్డి,
బి.యస్.సి., బి.యల్.,
వాది తరుపు న్యాయవాది

అడ్డుకున్నా ఆగని మట్టి అక్రమ తరలింపు

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండలో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అక్రమార్కులకు రాజకీయ అండదండలు ఉండడంతో అధికారులు సైతం ప్రేక్షక పాత్రకు పరిమితమవుతున్నారు. వినుకొండ మండలం తిమ్మాయపాలెం రెవెన్యూ పరిధిలోని పట్టణానికి అనుకొని ఉన్న నవాజ్ కుంట వద్ద తిమ్మాయపాలెం వాగులో మట్టిని తవ్వి అక్రమంగా తరలిస్తున్నారు. సమీపంలోని సుమారు 40 ఎకరాల రియల్ ఎస్టేట్ వెంచర్‌కు టర్బోలతో మట్టిని తరలిస్తున్నారు. మట్టి తవ్వకాలు తప్పనిసరిగా మైనింగ్ అనుమతులు అవసరం. కానీ అందుకు భిన్నంగా అనుమతులేమీ లేకుండానే అక్రమార్కులు వందల సంఖ్యలో టర్బోలతో మట్టిని తవ్వి తీసుకెళు_న్నారు. పట్టపగలే మట్టిని తరలిస్తున్నా స్థానిక, మండల స్థాయి అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. వారికి సైతం ముడుపులు ముట్టి ఉంటాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీనిపై తహశీల్దార్ సురేష్‌నాయక్‌ను వివరణ కోరగా తిమ్మాయిపాలెం రోడ్‌లో వాగు నుండి మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో అడ్డుకున్నట్లు చెప్పారు. మళ్లీ సాయంత్రం తరలిస్తున్నారని అడుగగా చర్యలు తీసుకుంటామన్నారు.



వెంచర్‌కు అనధికారికంగా తరలించిన మట్టి



క్యారమ్స్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

వైసిపి పాలనలో క్రీడలకు ఎలాంటి ప్రాధాన్యం దక్కిందో చెప్పడానికి ఆడుదాం ఆంధ్రా అక్రమాలే నిదర్శనమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఎన్నికలకు కొద్దిరోజుల ముందు హడావుడిగా రూ.150 కోట్లతో నిర్వహించిన పోటీల్లో రూ.100 కొట్టేశారని ఆరోపించారు. స్థానిక సీఆర్ క్లబ్‌లో శ్రీ గిరిరాజు కృష్ణమూర్తి మెమోరియల్ ఆంధ్ర స్టేట్ సెకండ్ ర్యాంకింగ్ క్యారమ్స్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. క్రీడా రంగంలో అవకాశాలను ఔత్సాహికులు అందిపుచ్చుకోవాలన్నారు. క్రీడా రంగం, క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా బ్రాండ్ ఏపీకి మంచి ప్రచారం తేవాలని సిఎం చంద్రబాబు ఆలోచిస్తున్నారని చెప్పారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను వైసిపి పాలనలో వేధించి, అవమానించి ఆటల నుంచి తప్పుకునేలా చేశారని విమర్శించారు. జట్లులో స్థానాలు, స్పోర్ట్స్ సర్టిఫికెట్లు, స్పోర్ట్స్ కోటాలో అవకాశాలను కూడా అమ్ముకున్నారన్నారు. ఇప్పుడు ఆటలకు తిరిగి ప్రాధాన్యంతో పాటు గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై నిగ్గుతేల్చే పనిలోనే తమ ప్రభుత్వం ఉందన్నారు.

డ్రగ్స్ నిర్మూలనను బాధ్యతగా భావించాలి

ప్రజాశక్తి - అమరావతి

డ్రగ్స్ మాఫియాపై పల్లోటి జూనియర్ కాలేజీ ఆవరణలో శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమానికి పల్లోటి ఫాదర్ వినోద్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రగ్స్‌ను పూర్తిగా నిషేధించాన్నారు. ముఖ్యంగా విద్యార్థులు వీటి బారిన పడకుండా ఉండాలని, బాధ్యతగా చదువుకోవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ ఫాదర్ భాస్కర్ మాట్లాడుతూ ప్రపంచాన్నే గడగలాడిస్తున్న డ్రగ్స్‌ను తరిమికొట్టడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలన్నారు. గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ విన్నెరసి, సిస్టర్ డియానా మాట్లాడుతూ డ్రగ్స్ బాధితుల్లో యువతులూ ఉండడం మరింత బాధించే అంశమన్నారు. కార్యక్రమంలో ఎస్సై నరసింహ, కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌కు నిర్మల విద్యార్థులు

ప్రజాశక్తి - వినుకొండ

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 23న సౌత్‌జోన్ అథ్లెటిక్స్ సెలక్షన్స్ జరిగాయి. ఈ పోటీల్లో నిర్మల స్కూలు విద్యార్థులైన బి.హర్ష (అండర్- 16) 60 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, ఎ. వెంకటరెడ్డి (అండర్- 14) 600 మీటరు పరుగు పందెంలో మూడవస్థానం సాధించినారు. సెప్టెంబరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో బి.హర్ష పాల్గొంటారని సిస్టర్ సెలీన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను, అథ్లెటిక్ కోచ్ డి.అశోక్, వ్యాయామ ఉపాధ్యాయులు పవన్, కరస్పాండెంట్ సిస్టర్ సిసిలి, ప్రిన్సిపల్ సిస్టర్ ఎస్.రాణి గోవిందు, సిస్టర్ బెనడిక్టా, సిస్టర్ ఎల్సీ చాకో అభినందించారు.





కార్మికులకు భద్రత, రక్షణ సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-మాచర్ల రూరల్

పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సేఫ్టీ ఆడిట్ కమిటి వేయాలని, అన్ని పరిశ్రమలు తనిఖీ చేయాలని, కార్మికులకు భద్రత రక్షణ సౌకర్యాలు కల్పించాలని సిఐటియు సిఐటియు డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ అచ్యుతాపురం ఫార్మాసెజ్‌లోని ఫార్మాస్యూటికల్ కంపెనీలో జరిగిన ప్రమాదం వల్ల 17 మంది, మరో కంపెనీలో నలుగురు కార్మికులు చనిపోయారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలను తనిఖీ చేయొద్దని ఆదేశాలు ఇవ్వటం జరిగిందని, ఆ ఆదేశాలను ఉపసంహరించుకుని కార్మిక శాఖను ప్రాక్టీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ డిపార్టుమెంటును వెంటనే తనిఖీలు చేయాలని ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరిగిన పరిశ్రమల యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల యాజమాన్యాలు కార్మికులకు తగిన భద్రత, రక్షణ సౌకర్యాలు కల్పిస్తూన్నాయాలేదో తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.మహేష్, శోభన్ కుమార్, మహేష్, వెంకటనారాయణ, శ్రీను, వెంకటరత్నం నాయక్, నాగరాజు, శివ పాల్గొన్నారు.

చెట్ల పెంపకంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - అమరావతి

చెట్ల పెంపకంపై మండలంలోని దిడుగు గ్రామం రైతులకు శనివారం శిక్షణిచ్చారు. ట్రీస్ అవుట్‌సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా (టిఒఎఫ్ఐ) ప్రోగ్రాం స్టేట్ అసోసియేట్ మారపల్లి ప్రణీత్ వర్మ ఆధ్వర్యంలో విహెచ్ఎ సాయిబాబు ఏర్పాటు చేశారు. సదస్సులో రైతులకు అగ్రోఫారెస్ట్రీ మీద ఉద్యాన వనమొక్కలు, అడవి జాతి మొక్కలు పెంపకంపై వివరించారు.



నాగూర్ అలీని సత్కరిస్తున్న రాయల శ్రీనివాసరావు తదితరులు

వాగ్దేవి డిగ్రీ విద్యార్థులకు ముగిసిన ఇన్ఫోసిస్ ఉన్నతి ఫౌండేషన్ శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : వెనుకబడిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు దక్కాలనే ఉద్దేశంతోనే తమ కళాశాలలో ఇన్ఫోసిస్ ఉన్నతి ఫౌండేషన్ శిక్షణ తరగతులు నిర్వహించినట్లు వాగ్దేవి డిగ్రీ కళాశాల సెక్రటరీ-కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో జులై 11 నుండి శనివారం వరకు డిగ్రీ చివరి ఏడాది విద్యార్థులకు 45 రోజుల పాటు 165 గంటలు బహుళజాతి కంపెనీ ఇన్ఫోసిస్ ఉన్నతి ఫౌండేషన్ ద్వారా శిక్షణ తరగతులు జరిగాయి. 80 మంది విద్యార్థులు శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ విద్యార్థులకు అనుభవం కలిగిన అధ్యాపకులచే నాణ్యమైన బోధనతో పాటు ఇటువంటి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో తమ కళాశాల విద్యార్థులు బహుళ జాతి కంపెనీలలో ప్రతి నిధులుగా ఉన్నారని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ కపిలవాయి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగాలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. శిక్షణలోని అంశాలను విద్యార్థులు కళాశాల యాజమాన్యం ముందు ప్రదర్శించారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ షేక్ నాగూర్‌అలీని సత్కరించారు.

ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక గ్రీవెన్స్‌కు 16 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక గ్రీవెన్స్‌ను పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 16 ఫిర్యాదులు అందాయి. వీటిని సత్వరమే విచారణ చేపట్టి పరిష్కరించాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. ప్రతినెలా 4వ శనివారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇదిలా ఉండగా గ్రీవెన్స్‌కు వచ్చే అర్జీదారుల సౌకర్యార్థం అర్జీదారులకు ఉచితంగా అర్జీలు రాసే విధంగా కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా సమస్యలు పరిష్కారం కోసం వచ్చే అర్జీదారులు వినతిపత్రం రాయించుకోవడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు గమనించి ఉచితంగా అర్జీలు రాసే ఏర్పాటు చేశామన్నారు. అర్జీదారులు ప్రైవేటు వ్యక్తులను సంప్రదించకుండా ప్రత్యేక కౌంటర్‌లో అర్జీలు రాయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెసి సూరజ్ ధనుంజయ్ పాల్గొన్నారు.

దళితుల సాగులో ఉన్న భూమి దళితులకే యాజమాన్య హక్కులు కల్పించాలని గిరిజన సంఘాల నాయకులు బి.శ్రీను నాయక్ వినతిపత్రం ఇచ్చారు. యడ్లపాడు మండలంలోని 150 ఎకరాల వ్యవసాయ భూమి అన్యక్రాంతమైందని, మాజీ మంత్రి ఆ భూములను తన బినామీలకు వైసిపి చెందిన వారికి కట్టబెట్టారని, మరికొంత భూమిని టిడిపికి చెందిన వారు ఆక్రమించారని చెప్పారు. ఈ భూములపై దర్యాప్తు చేసి భూమి లేని పేదలకు రెండెకరాల చొప్పున పంపిణీ చేయాలని కోరారు. చిలకలూరిపేట మండలంలోని యడవల్లి గ్రామ దళితులకు చెందిన భూముల్లో రూ.కోట్ల విలువైన మైనింగ్ నిక్షేపాలున్నా వారికి చాలా తక్కువగా పరిహారం ఇచ్చారని, సొసైటీని రద్దు చేశారని, బాధితుల దగ్గర చెక్కులు లాక్కున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. భూములు సర్వే చేయించి, అనుమతులు లేని మైనింగ్ ను రద్దు చేయాలన్నారు. మురికిపూడి గ్రామ దళిత రైతులకు గత ప్రభుత్వాలు మంజూరు చేసిన వ్యవసాయ భూమికి బీఫామ్ పట్టాలు ఇచ్చినా పూర్తి స్థాయిలో హక్కులు కల్పించలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీల ప్రాంతాల్లో వీధి దీపాలు, విద్య, వైద్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

రేపటి గ్రీవెన్స్ రద్దు

కృష్ణాష్టమి సందర్భంగా ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం-పిజిఆర్ఎస్)ను 26న రద్దు చేసినట్లు కలెక్టేరేట్ నుండి ఒక శనివారం ప్రకటన జారీ అయ్యింది.

అనధికార బోర్డులను వెంటనే తొలగించాలి

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులో అనధికార, ఫీజులు చెల్లించని ప్రకటనల బోర్డుల తొలగింపు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీని వాసరావు ఆదేశించారు. రోడ్ల పక్కన ఆక్రమణల తొలగింపు కూడా వేగవంతం చేయాలన్నారు. శనివారం కమిషనర్ తన చాంబర్‌లో పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మీడియా డివైజ్ ఫీజుల బకాయిదార్ల నుండి ఫీజులు చెల్లించని వారిపై చట్టపర చర్యలు తీసుకోవడానికి కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. రోడ్ల మార్జిన్లు, డ్రైన్ల మీద ఆక్రమణల వలన ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని, వెంటనే ఆక్రమణల తొలగింపు చేపట్టాలన్నారు. స్ట్రీట్ వెండర్స్ జోన్ల ఏర్పాటుకు సంబందించి ఫైల్ సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఏసిపి మురళి, టిపిఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

కలకత్తా ఘటనపై ప్రజాసంఘాల నిరసన



నిరసనలో పాల్గొన్న ప్రజా సంఘాల కార్యకర్తలు, నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరశిస్తూ స్థానిక బిఆర్ స్టేడియం వద్ద ప్రైమరీ హెల్త్ సెంటర్ ఎదుట ఐద్వా, సిఐటియు, ఐలు సంయుక్త ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ మాట్లాడుతూ ప్రజలకు వైద్య సేవలు అందించే డాక్టర్‌పై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఇంట్లో, పని ప్రదేశాల్లో మహి ళలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. చట్టాలు ఉన్నప్పటికీ వాటిని కఠినంగా అమలు చేయకపోవటం వల్లనే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్త్రీ, పురుష సమానత్వ భావన ఏర్పడినప్పుడే సమాజం ముందుకు వెళుతుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు చింతల శ్రీనివాసరావు, ఐద్వా నగర కార్యదర్శి ఏ.కళ్యాణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, ఐద్వా నగర అధ్యక్షులు జి.రమణ, ఎం.కృష్ణకుమారి, అంకమ్మ, శ్రావణి, రాణి, కుమారి పాల్గొన్నారు.

ప్రజాశక్తి- మేడికొండూరు : మండలం లోని ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్‌కళాశాలలో శనివారం హత్యాచారానికి గురైన వైద్యురాలికి నివాళులర్పిస్తూ శాంతిర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాసు మాట్లాడుతూ ట్రైన్ ఈ డాక్టర్ మౌనిత ను లైంగికంగా వేధించి, అత్యాచారం హత్య చేయడం ఎంతో దారుణమైన ఘటనని తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన పట్ల దేశం ఎంతో బాధిస్తుందని తెలుపుతూ, ప్రతి విద్యార్థి తాను వెళ్లే ప్రదేశాలను తెలివిగా గమనిస్తూ వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవాలని కోరారు. ప్రభుత్వాలు మహిళలు పనిచేస్తున్న ప్రదేశాల్లో సమగ్ర భద్రత కల్పించాలని కోరారు.

ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

గుంటూరు నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, ఉట్టికొట్టటం కార్యక్రమాలతో సందడి చేశారు.

ప్రజాశక్తి-గుంటూరు



భాష్యం విద్యా సంస్థల్లో..

భాష్యం విద్యా సంస్థలైన మెయిన్ క్యాంపస్ లిటిల్ ఛాంప్స్, బ్లూమ్స్, టాడ్లర్స్, సాంబశివపేట, ఆర్టీసి కాలనీ, పట్టాభిపురం, ఎస్‌విఎన్ కాలనీ, ఎన్‌జిఒ కాలనీ, నగరాలు, ఇతర బ్రాంచిలలో కృష్ణాష్టమి ముందస్తు వేడుకలు అంబరాన్నంటాయి. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. కృష్ణుని జన్మవృత్తాంతాన్ని, కృష్ణుడి లీలను చిన్నారులు ప్రదర్శించారు. కృష్ణ పాదాలకు ముగ్గులు పెట్టడం, ఉట్టి కొట్టడం వంటి కార్యక్రమాలు అలరించాయి. చిన్న వయస్సు నుండే పండుగల గురించి తెలుసుకోవాల్సిన అవసరాన్ని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ వివరించారు.



విజేత హైస్కూల్లో..

స్థానిక ఏటిఅగ్రహారంలోని విజేత హైస్కూల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపిక వేష ధార ణలతో అలరించారు. స్కూల్ డైరెక్టర్ చెరుకూరి శ్రీహరి కృష్ణాష్టమి గురించి వివరించారు. ముఖ్యంగా ఉట్టి కొట్టడం, శ్రీకృష్ణుడికి ఇష్టమైన అటుకులు కొబ్బరి తురుము బెల్లంతో తయారు చేసిన ప్రసాదం విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ కె.అన్నపూర్ణ పాల్గొన్నారు.

సుమేధా హైస్కూల్లో..

ఎన్‌జిజిఒ కాలనీలోని సుమేధ హైస్కూల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి కృష్ణాష్టమి ప్రాధాన్యతను వివరించారు. బియ్యం పండితో చిన్న చిన్నపాదముద్రలు వేసి, బాలగోపాలుడిని ఆహ్వానించారు. చిన్నారులు కృష్ణుడు, గోపిక వేషధారణలతో అలరించారు. ఉట్టికొట్టడంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.





జైన్ హైస్కూల్లో..

సంగడిగుంటలోని జైన్ హైస్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడి వేషధారణలో అలరించారు. స్కూల్ డైరెక్టర్ డాక్టర్ యండి.మున్ను విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.



ప్రజ్ఞ విద్యాసంస్థల్లో..

స్థానిక నగరంపాలెం ప్రజ్ఞ విద్యా సంస్థలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు రాధా కృష్ణులు, గోపికల వేషధారణలతో సినీ నత్య గీతాలకు అనుగుణంగా ఆడి పాడారు. విద్యాసంస్థ కార్యదర్శి, కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఇస్కాన్ యూత్ లీడర్ ట్రైనర్ వరాహ కష్ణదాస్, పాఠశాల ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బిహెచ్ కాలేజీలో

స్థానిక బ్రాడీపేటలోని బిహెచ్ డిగ్రీ కాలేజిలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు కోలాటం, బృందనృత్యాలతో అలరించారు. కృష్ణుడి వేషధారణలో ఉత్సాహంగా ఉట్టికొట్టారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు డాక్టర్ బి.వి.విజయభాస్కర్, కార్యదర్శి చేగుశ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కౌసల్యాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాధామాధవి తదితరులు పాల్గొన్నారు.





కెఎల్‌పి స్కూల్లో..

డాక్టర్ కెఎల్‌పి పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి ఘనంగా నిర్వహించారు. పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ శ్రీకృష్ణుని జన్మదిన విశేషాలు వివరించారు. పాఠశాల ప్రాంగణాన్ని రంగవల్లులు, రంగుల డిజైన్ కాగితాలతో అలంకరించి శ్రీకృష్ణుని పాదాల గుర్తులు వేసి ఆహ్వానిస్తూ గీతాలాపన చేశారు. కృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శ్రీపూజిత స్కూల్లో..

పట్టాభిపురంలోని శ్రీపూజిత స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. చిన్నారులు కృష్ణుడు వేషధారణలతో అలరించారు. కృష్ణుడి గీతాలకు నృత్యాలు చేశారు.పాఠశాల ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

హిందూ ఫార్మసీలో..



స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ఆవరణలో విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ప్యాట్రిక్స్ స్కూల్లో..

స్థానిక లాలాపేటలోని సెయింట్ ప్యాట్రిక్ స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలతో కృష్ణుడి గీతాలకు నృత్యాలు చేశారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి స్కూల్ డైరెక్టర్ సాయిబాబు ప్రసంగించారు.



యన్.వి.నరసింహారావుకు సిపిఎం నివాళి

ప్రజాశక్తి-గుంటూరు


ఎన్‌వి నరసింహారావు భౌతిక ఖాయానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

సీనియర్ కమ్యూనిస్టు ఉద్యమ నేత, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం నాయకులు యన్.వి. నరసింహా రావు మృతికి సిపియం గుంటూరు జిల్లా, నగర కమిటీలు సంతాపాన్ని తెలియచేశాయి. శనివారం యన్.వి.నరసింహారావు అనారోగ్యంతో మృతి చెందారు. కొరిటపాడులోని నరసింహా రావు కుమార్తె నివాసంలో ఆయన భౌతిక ఖాయాన్ని సిపియం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, నగర కార్యదర్శి కె.నళినీకాంత్, నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.ముత్యాలరావు, నాయకులు టి.రాజేష్ తదితరులు సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. నరసింహారావు చివరి వరకు తాను నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి పని చేశారని, సమాజం మారాలని కోరుకున్నారని పాశం రామారావు అన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకుపోవటమే వారికిచ్చే నివాళి అని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియచేశారు.

సిపిఎం నాయకులు రామ్మోహన్‌రెడ్డికి నివాళి

ప్రజాశక్తి-తాడేపల్లి



పెను మాకకు చెందిన సిపిఎం నాయ కులు కళ్లం రామ్మోహ న్‌రెడ్డి లేని లోటు పార్టీతో పాటు వారి కుటుంబ సభ్యులకు తీరనిదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.రవి, సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, తాడేపల్లి పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గాదె సుబ్బారెడ్డి, సిఐటియు రాజధాని డివిజన్ నాయకులు ఎం.భాగ్యరాజు, రైతు సంఘం నాయకులు కె.ఈశ్వరరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. రామ్మోహన్‌రెడ్డి సంస్మరణ సభ శనివారం పెనుమాకలోని ఆయన స్వగృహం వద్ద సిపిఎం నాయకులు ఎస్‌కె పీరుసాహెబ్ అధ్యక్షతన నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ చివరి వరకు తాను నమ్మిన ఆశయం కోసం నికరంగా నిలబడి పని చేశారని చెప్పారు. తన తండ్రి వెంకటరెడ్డి, బాబాయ్ పానకాలరెడ్డి ఒరవడితో సొసైటీ అధ్యక్షులుగా పని చేసి అందరి మన్ననలు అందుకున్నారని తెలిపారు. ముందుగా రామ్మోహన్‌రెడ్డి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సిపిఎం అభిమాని తోట నరసింహారావు కన్నుమూత

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్


తోట నరసింహారావు (ఫైల్ ఫోటో)

ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి గ్రామానికి చెందిన సిపిఎం సానుభూతి పరులు తోట నరసింహారావు (69) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని, ఇంటివద్దే ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన కుమారులు ఇద్దరు వివిధ రకాల అనారోగ్య కారణంతో చనిపోయారు. అప్పటినుండి నరసింహారావు అనారోగ్యానికి గురై, మానసికంగా కంగిపోయారు. నరసింహారావు మృతి వార్త తెలుసుకున్న సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి నరసింహారావు భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం కుంచనపల్లి గ్రామ ఒకటవ శాఖ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు, అమ్మిశెట్టి రామారావు, టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, వైఎస్ఆర్సిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా శివ నాగేశ్వరరావు, వైఎస్ఆర్సిపి గ్రామ అధ్యక్షులు మిరియాల రాంబాబు, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు మేకల రాజా, కుటుంబ సభ్యులు తోట రాంబాబు, తోట హరిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.


వరదబాధితులకు పంపేందుకు చెక్‌ను చూపుతున్న దృశ్యం

వరద బాధిత విరాళాలకు అభినందన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కేరళ రాష్ట్రంలోని వాయ్‌నాడ్ జిల్లా పునర్నిర్మాణానికి తమ వంతు బాధ్యతగా స్పందించి, నేను సైతం అంటూ విరాళాలు ఇచ్చిన ప్రతిఒక్కరూ అభినందనీయులని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ మాదాసు భాను ప్రసాద్ శనివారం అన్నారు. మనకెందుకులే అని ఊరుకోక స్పందించి బాధ్యతగా విరాళాలు ఇవ్వడం దానగుణమన్నారు. మొత్తం రూ.62,217 విరాళంగా వచ్చాయన్నారు. దీనిని డిడి రూపంలో కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధికి పంపిస్తామని పేర్కొన్నారు. ఇందుకు గాను రూ.17,100 సాయిచాణక్య స్కూల్ విద్యార్థుల ద్వారా విరాళం అందాయన్నారు. వారికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మురకొండ వెంకట్రావు, హరిప్రసాద్, కష్ణ ప్రసాద్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు భూములివ్వాలి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని, నిరుపేదలైన వారికి వ్యవసాయ భూములు ఇవ్వాలని ఏపి గిరిజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక ఎంఆర్‌టి.సెంటర్లోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. యడ్లపాడు మండలంలోని సుమారు 150 ఎకరాల వ్యవసాయ భూమి అన్యాక్రాంతమైందని, గత ప్రభుత్వంలో ముగ్గురు తహాశీల్దార్‌లను మార్చిన ఘనత మాజీమంత్రి విడదల రజినికే దక్కుతుందని, ఆమె దృష్టికి సమస్యను తీసుకెళ్తే చేయలేదని వాపోయారు. అధికారులు రీసర్వే పేరిట జాప్యం చేశారన్నారు. నిరుపేదలైన ఎస్సి, ఎస్టీలకు రెండుఎకరాల వ్యవసాయ భూమి ఇవ్వ లేక పోయారన్నారు. దీనిపైన దర్యాప్తు చేసి పేదలకు న్యాయం చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మండలంలోని యడవల్లి గ్రామ ఎస్సి, ఎస్టీలకు చెందిన భూములల్లో కోట్ల విలువ కలిగిన మైనింగ్ నిక్షేపాలు ఉన్నప్పటికీ చాలా తక్కువ పరిహారం ఇచ్చారని, సొసైటీని రద్దు చేశారని, కొంత మంది బాధితుల దగ్గర చెక్కులు లాక్కున్నారని తెలిపారు. ఈ విషయమై గత ప్రభుత్వంలో అలక్ష్యం చేసిందని ప్రస్తుత ప్రభుత్వమైనా తమకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కాకని రోశయ్య, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడను కలిసిన సిఐ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట 2వ పట్టణ సిఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన హైమారావు ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబును శనివారం టిడిపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కులమతాలకు అతీతంగా పార్టీలు చూడకుండా ఆయా సమస్యలు పరిష్కరించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ న్యాయం చేయాలని, శాంతిభద్రతల స్థాపనకు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారని సిఐ తెలిపారు.



సంక్షోభంలో సంక్షేమ హాస్టళ్లు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

చిలకలూరిపేట నియోజకవర్గ స్థాయిలో సంక్షేమ హాస్టళ్లు సంక్షోభంలో కూరుకుపోయాయి. సంవత్సరం నుంచి కాస్మోటిక్ బిల్లులు రాక విద్యార్థులు అర్ధాకలి పాటిస్తున్నారు. పట్టణంలో మూడు బిసి హాస్టళ్లు, ఒక కాలేజి హాస్టల్, నాలుగు ఎస్సీ హాస్టళ్లు(జనరల్ హాస్టళ్లు) ఒక్క ఎస్‌టి హాస్టల్, ఒక రెసిడెన్షియల్ స్కూల్ ఉంటున్నాయి. వీటిలో ఎస్‌సి హాస్టల్‌కు జనవరి నుంచి ఇప్పటి వరకు బిల్లులు చెల్లింపులు లేవు. మిగిలిన హాస్టళ్లకు జూన్, జులై నెలలకు కాస్మో టిక్, ఇతరత్రా బిల్లులు అందలేదు. బిల్లులు లేకుండా హాస్టల్ విద్యార్థుల ఆకలిని ఎలా తీర్చేదని వార్డెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్వాహణ కోసం అప్పులు పుట్టడం లేదని వాపోతున్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో వసతి గృహాలకు ఉచితంగానే సన్న బియ్యం పంపిణీ చేసేవారని ఆపై వచ్చిన వైసిపి ప్రభుత్వంలో ఆ పద్ధతిని మార్చివేసిందన్నారు. నేరుగా వార్డెన్లే బియ్యాన్ని కొనేవిధంగా చేశారన్నారు. దీంతో తమ పరిస్థితి ములిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మారిందన్నారు. గ్యాస్ సిలిండ్ విషయంలోనూ అదేతంత సాగిందన్నారు. హాస్టల్ కరెంటు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆఖరికి బల్బు పాడైనా కొత్తవి కొనడానికి తామే ఖర్చు చేయాల్సివస్తోందని వాపోతున్నారు. హాస్టళ్లకు నెలకు 10, 12 గ్యాస్ సిలెండర్లు పడతాయని గత ప్రభుత్వాల హయాంలో జరిగిన విధివిధానాలు పూర్తిగా సిలిండర్ డబ్బులు ఇచ్చి కొనాల్సి వస్తోందని, సిలిండర్ సుమారుగా రూ.1000 దాకా ఉందంటున్నారు. మరుగుదొడ్ల నిర్వహణ తాగునీరు, ఇతర మరమ్మతులకూ ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడం లేదని వార్డెన్లు వాపోతున్నారు. వైసీపీ పాలనలో వసతిగృహాలపై నిర్లక్ష్యం వహించారని, కనీసం కూటమి ప్రభుత్వం వచ్చిందని సంబరపడ్డా ఆశించినవిధంగా లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టళ్లకు మెనూ మార్చి విద్యార్థులకు నెలవారీ ఛార్జీలను చెల్లించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. తనకు నూనె, స్నానానికి సబ్బు కొనాలన్నా విద్యార్థులు ఇంటివైపు చూసే పరిస్థితి నెలకొంది. మూడో నుండి ఆరో తరగతి బాలికలకు రూ.110, బాలురకు రూ.100 చెల్లించాల్సి ఉంది. అలాగే ఏడు నుండి పదో తరగతి బాలికలకు రూ.160, బాలురకు రూ.125, క్రాప్‌కు అదనంగా రూ.30 చొప్పున చెల్లించాల్సి ఉంది. బాలురుకి రూ.30 చొప్పున క్రాఫ్ (ఎయిర్ కటింగ్) ఇవ్వాల్సి ఉంది. పాఠశాల స్థాయి విద్యార్థులకు నెలకు రూ.2,200 ఖర్చు అవుతుంటే ప్రభుత్వం రూ.1400 ఇచ్చి చేతులు దులుపుకుంటుందని వాపోతున్నారు. కళాశాల స్థాయి విద్యార్థులకు నెలకు రూ.1600 చెల్లించి ఉదయం టిఫిన్ అందించాల్సి ఉంది. కళాశాల విద్యార్థులకు రోజుకు



రూ.53,33పైసలు అందిస్తుంటే స్కూల్ విద్యార్థులకు రోజుకు రూ.46,66 పైసలు అందిస్తుందని తెలిపారు. ఈ మెనూ విద్యార్థుల ఆకలిని తీర్చలేకపోతోందని అంటున్నారు. పప్పులు, కూరగాయలు, నూనె, గ్యాస్‌ల అన్ని ధరలు భారీగా పెరిగాయని, ఆ స్థాయిలో వసతి గృహాలకు బడ్జెట్లు ప్రభుత్వం పెంచలేక పోతోందని వాపోయారు. ప్రభుత్వం ఇవేమీ చెల్లించక పోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులపై అదనంగా భారం పడుతోందన్నారు. ఈ సంవత్సరం ప్రారంభంలో వసతిగృహల విద్యార్థులకు కొత్త సామాగ్రిని ప్రభుత్వం పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు నోట్ పుస్తకాలు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు, ట్రంకుపెట్టె తదితర సామా గ్రి అందలేదన్నారు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం స్పందించి వెంటనే మార్కెట్లో ధరలు పరిశీలించి దానికి అనుగుణంగా మోనో పెంచి విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడాలని కోరుతున్నారు.

అభివృద్ధికి దాతల సహకారం అవసరం


బస్‌షెల్టర్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చిలకలూరిపేట

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఆ కృషికి దాతల సహకారం తోడైతే అద్భుతాలు చేయవచ్చని ఊరి నుంచి ఎదిగిన శ్రీమంతులు, స్థితిమంతులు, ప్రవాసాంధ్రులు ఆ దిశగా ఆలోచించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలో గల గొట్టిపాడు రక్షణ కాలనీలో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన నూతన బస్‌షెల్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్టర్ కృపా లావణ్య సౌజన్యంతో బస్‌షెల్టర్‌ను నిర్మించడం మంచి పరిణామం మన్నారు. ప్రతి ఊరిలోనూ కలిగివారు కాస్తంత ఆలోచిస్తే పల్లెలు కొత్తరూపుం దాల్చుతాయని పేర్కొన్నారు. త్వరలో ప్రారంభం కానున్న జన్మభూమి-2లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ అంశాన్ని ప్రముఖంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నిర్ణయించారన్నారు. తమవారి జ్ఞాపకాలను గ్రామాల అభివృద్ధి చిహ్నాల్లో చూసుకునే అరుదైన, అద్భుతమైన అవకాశాన్ని ఆర్థికంగా ఉన్నతవర్గాల వారు ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీ ప్రముఖ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు


డిఎస్పీకి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పోలీస్ స్టేషన్‌లో ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఉచిత కంటి వైద్యశిబిరం శనివారం నిర్వహించారు. డాక్టర్ అగర్వాల్ క్లీనిక్ ఆధ్వర్యంలో పోలీసులకు కంటి పరీక్ష చేశారు. ఈ శిబిరాన్ని సత్తెనపల్లి డిఎస్పీ జి గుర్నాద బాబు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పట్టణ రూరల్ పోలీసులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ బి.బ్రహ్మయ్య , రూరల్ సిఐ పి శ్రీనివాసరావు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ శనివారం భూమి పూజ చేశారు. 10లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న సిసి రోడ్డు కు భూమి పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇదిలా ఉండగా రాజుపాలెం కేయల్ రావు పులిచింతల ముంపు ప్రాంతాల నిర్వాసితులకు పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొని అర్హులైన వారికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం చౌటపాపాయిపాలెంలో సుమారు 43 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. 14 డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.1.34 కోట్ల బ్యాంకు లింకేజీ చెక్కును అందచేశారు.కార్యక్రమాల్లో టిడిపి నాయకులు మన్నెం శివనాగమల్లేశ్వరరావు , మాజీ సర్పంచ్ కట్టా రమేష్ మహిళా నాయకురాలు గొర్రెపాటి సుశీల, పూజల వెంకట కోటయ్య,అంచుల నరసింహారావు జనసేన నాయకులు బత్తుల నర్సయ్య, అధికారులు పాల్గొన్నారు.


సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ఆదివాసీల అభివృద్ధికి 'పిఎం జన్‌మన్'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రతి చెంచు కుటుంబానికీ చేరేలా పిఎం జన్‌మన్ ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో జన్ మన్ కార్యక్రమంపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని 6 మండలాలల్లో 51 నివాస ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న చెంచుల కుటుంబాలు లక్ష్యంగా ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. దీనిపై సెప్టెంబరు 20 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఐటిడిఎ శ్రీశైలం, గిరిజన సంక్షేమ అధికారులను ఆదేశించారు. చెంచు నివాసాల్లో 11 రకాల కనీస వసతుల కల్పన కోసం ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ప్రధాన్ మంత్రి


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ గురించి ప్రతి చెంచు కుటుంబాలకు తెలియజేయాలన్నారు. దీనికి బొల్లాపల్లి, కారంపూడి, మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, రెంటచింతల ఎంపీడీఓలు ఐటిడిఎ అధికారులకు సహకారం అందించాలన్నారు. ఇప్పటి వరకూ చెంచుల నివాసప్రాంతాల్లో కల్పించిన వసతుల వివరాలను త్వరితగతిన ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఐటిడిఎ ఏపిఓ సురేశ్, జిల్లా అటవీ అధికారి రామచంద్రరావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, హౌసింగ్ పిడి శివలింగం, ఆర్డబ్ల్యూస్ డి.ఈ ఏడుకొండలు, వైబిఎస్ఈ రాజా నాయక్, అడిషనల్ డీఎంహెచ్ఓ మురళీకృష్ణ, నరసరావుపేట, గురజాల డిఎల్‌డిఓలు వెంకటరెడ్డి, గబ్రు నాయక్, డిఇఓ వెంకటేశ్వర్లు, మాచర్ల మున్సిపల్ కమిషనర్ అఫ్జల్‌ఖాన్, బీఎస్ఎన్ఎల్ డీఈ చంద్రశేఖర్, ఎంపిడివోలు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ కూరపాటి శ్రీనివాస్

ఆహార నియమాలతో సంపూర్ణ ఆరోగ్యం

ఆయుర్వేద కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఆరోగ్యమే మహాభాగ్యమని విజయవాడలోని ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కూరపాటి శ్రీనివాస్ అన్నారు. శనివారం కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో భారతీయ జ్ఞాన పరంపర (ఐకెఎస్)ను ప్రోత్సహించడంలో భాగంగా, కోనేరు లక్ష్మయ్య విశ్వ విద్యాలయ కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ విభాగం, ఆంధ్ర ప్రదేశ్ విజ్ఞాన భారతి సంయుక్తం గా 'ఆయుర్వేదం ద్వారా ఆరోగ్య కరమైన జీవనం' అంశంపైన నిర్వహించిన సదస్సులో శ్రీనివాస్ మాట్లాడారు. ఆయుర్వేదం భారతీయ ప్రాచీన వైద్య విధానమని, ఎంత మొండి రోగాలకైనా సులువుగా చికిత్స చేయవచ్చునని అన్నారు. ఆయుర్వేద వైద్యం పట్ల సమాజం ఉన్న అపోహలు నిజం కాదన్నారు. ముఖ్యంగా నేటి యువత ఆహార నియమాలు సరిగా పాటిస్తే సగం రోగాలు నయం చేయవచ్చునని అన్నారు. సదస్సు కన్వీనర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మారుతున్న జీవన విధానం పుణ్యమా అని యువత చిన్న వయస్సులోనే పలు రకాల వ్యాధుల బారిన పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారధి వర్మ, డాక్టర్ కెఎస్.జగన్నాథరావు, డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్.ఎస్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



వడ్డేశ్వరంలో పొగాకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న కెఎల్ యు విద్యార్థులు

పొగాకు ఉత్పత్తులు కేన్సర్ కారకం

ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిశోర్‌బాబు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

పొగాకు ఉత్పత్తులు వినియోగించటం వలన క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ మేనేజ్ హ్యూమానిటీ సైన్స్ (ఎంహెచ్ఎస్) డీన్ డాక్టర్ ఎం.కిశోర్ బాబు అన్నారు. శనివారం యూనివర్శిటీ ఎంబీఏ విభాగం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా యువత ప్రచారం అనే కార్యక్రమంలో నిర్వహించారు. 200 మంది విద్యార్థినీ, విద్యార్థులు వడ్డేశ్వరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చిన్నా పెద్దా తేడా లేకుండా చుట్టా, బీడీ, సిగరెట్, పాన్ పరాగ్, ఖేనీ వంటి పలురకాల పొగాకు ఉత్పత్తులకు బానిసలు అయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని వినియోగంచటం వలన నోరు, గొంతు, ఊపిరితిత్తులు తదితర అవయువాలకు క్యాన్సర్ సోకి అర్థాంతరంగా జీవితాన్ని ముగించాల్సి వస్తుందన్నారు. కెఎల్ బిజినెస్ స్కూల్ ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ కె.హేమ దివ్య మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు ప్రాణాంతకం, పొగాకు బానిసలు కాకుండా యువత తమ జీవితాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఎంబీఏ ఉప విభాగాధిపతి డాక్టర్ బాలాజీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కెవివి.రాజు మాట్లాడుతు ప్రజలందరు పొగాకు వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ర్యాలీలో గ్రామ పెద్దలు కత్తిక మల్లిఖార్జున రావు, అధ్యాపకులు డాక్టర్ శ్యామ్ సుందర్ త్రిపతి, డాక్టర్ సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచండి : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - మేడికొండూరు

వాతావరణ సమతౌల్యానికి ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెలిపారు. శనివారం పేరేచర్ల లోని వీఆర్ఓ థామస్ లైవ్‌లి హుడ్ లెర్నింగ్ సెంటర్‌లో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని చేపట్టిన విలేజ్ రీకన్స్ట్రక్షన్ ఆర్గనైజేషన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంస్థ ద్వారా పది వేల మొక్కలు నాటేందుకు 15 గ్రామాల నుండి వచ్చిన ప్రజలు మూడు స్కూళ్ళ నుండి వచ్చిన విద్యార్థులు ఇక్కడ నుండి తీసుకువెళ్ళే మొక్కలను తప్పకుండా నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత వుందన్నారు. మొక్కలు నాటడం మన కోసం , మన భవిష్యత్తు కోసం చేపట్టే ఒక గొప్ప కార్యక్రమం అన్నారు. కనీసం ఈ మొక్కలను మూడు సంవత్సరాల వరకు జాగ్రత్తగా సంరక్షించగలిగితే వాటి మనుగడకు భరోసా ఇచ్చినట్లు అవుతుందన్నారు. జిల్లాలో నాటేందుకు రెండు లక్షల మొక్కలను సమీకరించడం జరుగుతున్నదన్నారు. సీఎస్ఆర్ క్రింద భారీ ఎత్తున మొక్కలు నాటేందుకు వివిధ సంస్థలు ముందుకు వస్తున్నాయన్నారు. కేవలం ప్రభుత్వమే కాకుండా ప్రభుత్వ రంగ సంస్థలు, ఎన్జీఓలు కలసికట్టుగా కార్యక్రమాలు చేపట్టినపుడు వాతావరణ పరిస్థితులు మార్చడానికి అవకాశం వుంటుందన్నారు. మొక్కలు నాటడం ఒక ఎత్తు అయితే వాటి సంరక్షణ బాధ్యత సంక్లిష్టంగా వుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ తాము నాటే మొక్కలను జాగ్రత్తగా సంరక్షించి పెంచాలని కోరారు. విలేజ్ రీకన్స్ట్రక్షన్ ఆర్గనైజేషన్‌వ్యవస్థాపకులు వేలాంగణి మాట్లాడుతూ పది వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని సంస్థ ద్వారా చేపట్టడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో డిఎఫ్ ఓ మహబూబ్ బాష , డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి, డిసిఓ వీరాచారి , సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ మధుసూధన రావు, మేడికొండూరు తహసీల్దార్ పద్మనాభుడు తదితరులు పాల్గొన్నారు.



పేరేచర్లలో మొక్కను నాటుతున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ

సాదియా ఆల్మాస్‌కు మంత్రి నారాలోకేష్ ఆర్థికసాయం

ప్రజాశక్తి మంగళగిరి : రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారిణికి రూ.3 లక్షలు అందజేశారు. మాల్టా దేశంలోని జరుగుతున్న అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలకు భారత దేశం నుంచి మంగళగిరికి చెందిన సాదియా అల్మాస్ పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మంత్రి నారా లోకేష్‌ను పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి సాదియా అల్మాస్ కలిశారు. ఛాంపియన్ షిప్‌లో పాల్గొనడానికి ఆర్థిక సాయంచేయాలని అల్మాస్ కోరారు. పోటీల్లో పాల్గొనాలంటే రూ.3 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. తమకు అంత ఆర్థిక స్థోమత లేదని ఆమె తెలిపారు. ఇందుకు మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ, రాష్ట్రానికి, దేశానికి పేరు తెచ్చేలా కృషి చేయాలని, చాంపియన్ షిప్ లో పాల్గొనడానికి అవసరమైన ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. వెంటనే ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరుతో రూ.3 లక్షలను స్థానిక నాయకుల ద్వారా పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి సాదియా అల్మాస్ కు మంగళగిరి నియో జకవర్గం టిడిపి కార్యాల యంలో శనివారం సాయంత్రం అందజేయించారు. మంత్రి నారా లోకేష్‌కు సాదియా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు పార్ల మెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నాయకులు నందం అబద్దయ్య దామర్ల రాజు, షేక్ రియాజ్, గుత్తికొండ ధనుంజయరావు, తదితరులు పాల్గొన్నారు.



సాదియా ఆల్మాస్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

పలు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి పాండురంగపేట అంగన్వాడీ కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. 27వ వార్డు కౌన్సిలర్ బోయపాటి అరుణ చిన్నారులకు కృష్ణాష్టమి ప్రాముఖ్యతను వివరించారు.

ప్రజాశక్తి - తెనాలి : స్థానిక బోస్ రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో శనివారం కృష్ణాష్టమి ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళి కాంత్ దాసరి పర్యవేక్షణలో నర్సరీ నుంచి ఒకటో తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కృష్ణుడు, రాధ, గోపికలు వేషధారణలో విద్యార్థులు అలరించారు.

ప్రజాశక్తి- మంగళగిరి : మంగళగిరి నారాయణ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రసన్నాంజనేయులు విద్యార్థులకు కృష్ణాష్టమి గురించి వివరించారు. కార్యక్రమంలో తెనాలి డివిజన్ డివైఇఒ జి. శాంత కుమారి, ఏజీఎం మురళి కిషోర్, ఆర్ ఐ రామా రావు, ఈ చాప్స్ కోఆర్డినేటర్ ఫాతిమా ఖాన్, తదితరులు పాల్గొన్నారు.







వర్సిటీలో బిపి మండల్, జ్యోతిబాపూలేకు ఘన నివాళి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యములో శనివారం బి. పి. మండల్ 106 జయంతిని ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ అధికారులు రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య. సి. హెచ్. స్వరూపరాణి, మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య.ఎం. త్రిమూర్తి రావు తదితరులు మహాత్మా జ్యోతిరావు పూలే, బి. పి. మండల్ చిత్ర పటాలకు పూల మాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆచార్య. ఎం. త్రిమూర్తి రావు అధ్యక్షత వహించి మాట్లాడితూ ఈ దేశంలో ఓబిసి రిజర్వేషన్లు కోసం అహర్నిశలు బి.పి. మండల్ కృషిచేసారని తెలియచేశారు. ఇన్చార్జి రెక్టార్ ఆచార్య కె . రత్నషీలామణి, ఆచార్య సిహెచ్ స్వరూపరాణి మాట్లాడుతూ బి. పి. మండల్ బి. సి ల అభ్యున్నతి కోసం ఎంతగానో పాటుపడ్డారని రిజర్వేషన్లలో 27 శాతం బి.సి లకు దక్కేటట్లు చేసిన ఘనత బి.పి.మండల్ కి చెందుతుందన్నారు. నేడు బి.సి.లు రిజర్వేషన్ల ఫలాలు పొందుతున్నారంటే ఆ గొప్పతనం బి. పి. మండల్ కి చెందుతుందని గుర్తు చేశారు. సమావేశానికి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఇన్చార్జి డైరెక్టర్ ఆచార్య. వి. వెంకటేశ్వర్లు, ఎన్ ఎస్ ఎస్ ఇన్చార్జి కో ఆర్డినేటర్ డాక్టర్. దివ్యతేజోమూర్తి, యు జి సి ఇన్చార్జి కో ఆర్డినేటర్ ఆచార్య. అశోక్ కుమార్, జగ్జీవన్ రామ్ చైర్ ఇన్చార్జి సంచాలకులు ఆచార్య రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.



సూపర్ సెవెన్‌గా సినీ పరిశ్రమను చేర్చాలి

మా ఏపి వ్యవస్థాపకులు దిలీప్ రాజా

ప్రజాశక్తి-తెనాలిరూరల్



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్‌కు అదనంగా సినిమా పరిశ్రమ అభివృద్ధిని సూపర్ సెవెన్‌గా చేర్చాలని 'మా-ఏపి' వ్యవస్థాపకులు, సినీ దర్శకులు దిలీప్ రాజా కొరారు. స్థానిక మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ కార్యాలయంలో శనివారం మీడియాతో అసోసియేట్ డైరెక్టర్ ఇంటూరి విజయభాస్కర్‌తో కలసి ఆయన మాట్లాడారు. త్వరలో జరగనున్న కేబినెట్ సమా వేశంలో ఏపీలో సినీ పరిశ్రమ అభివృద్ధి పై ప్రభుత్వం ఎలాంటి చర్యలు అమలుచేయనున్నారో మంత్రివర్గ సమావేశంలో చర్చించాలని కోరారు. హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం లాంటి పట్టణాలకు అనుకూలంగా అమరావతిలో సకల సదుపాయాలతో కూడి స్టూడియోలను ప్రభుత్వం నిర్మించాలన్నారు. నిర్మాణాలు చేపట్టడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందన్న అభిప్రాయం వ్యక్తపరిచారు. స్టూడియోల నిర్మాణాలకు ముందుకొచ్చిన వ్యాపారవేత్తలకు ప్రభుత్వం స్థలాలను కేటాయించవలసిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రాలో నివాసం ఉండేందుకు ఇష్టపడుతున్న సినీ కార్మికులకు ఇండ్లస్థలాలను కేటాయిస్తే అమరావతిలో ఫిలిం నగర్ ఏర్పటుకాగలదనే ఆశాభావాన్ని వ్యక్తపరిచారు.



జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం సమీపంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని శనివారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిలో ప్రారంభమైన కార్యాలయం నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు ఎస్.నాగేశ్వరరావు, కార్యదర్శి చాముండేశ్వరిదేవి, పట్టణ నాయకులు ఎ.తిరుపతిరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, టి.సాంబశివరావు, ఎ.మురళీ, దినేష్ చక్రవర్తి, ఎం.నాని, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచితంగా యోగా శిక్షణ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ లక్ష్మీ నారాయణస్వామి వారి దేవస్థానం ఆవరణలో శ్రీ రాధాకృష్ణా యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన సాయంత్రం ఉచిత యోగ శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకులు, ప్రధాన యోగాచార్యులు పడమట రాధాకృష్ణా యోగి గురూజీ తెలిపారు. మూడు వారాలు పాటు జరిగే యోగ శిక్షణ శిబిరంలో యోగాసనములు, ధ్యానంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పట్టణ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

డాక్టర్ అఖిలేష్ గుప్తాకు కెఎల్‌యు విజనరీ అవార్డు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

మాజీ యుజిసి కార్యదర్శి, సెర్బ్ సలహాదారు డాక్టర్ అఖిలేష్ గుప్తాకు కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ విజనరీ అవార్డును 29న వడ్డేశ్వరంలోని కెఎల్‌యు వర్శిటీ ప్రాంగణంలోని న్యూ సెమినార్ హాలులో అందజేయనున్నారని వర్శిటీ ప్రో చాన్సులర్ డాక్టర్ కెఎస్.జగన్నాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా సైన్స్ పరంగా, సామాజికంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో సేవలందించిన వారికి 2024వ సంవత్సరం నుండి విజనరీ అవార్డులు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గత 40 ఏళ్లుగా సైన్స్‌ను అభివృద్ధి చేయడానికి ఎంతగానో కృషి చేసినందుకుగాను తాము డాక్టర్ అఖిలేష్ గుప్తాకు ఈ విజనరీ అవార్డును అందిస్తున్నట్లు విసి తెలిపారు. గతంలో యుజిసి కి కార్యదర్శిగా సేవలందించిన గుప్తా ప్రస్తుతం సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డు (సెర్బ్)కు సలహాదారులుగా పనిచేస్తున్నారని తెలిపారు.

శివారు ప్రాంతాలకు తాగునీరు : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు



స్వర్ణభారతి నగర్‌లో పర్యటించిన కమిషనర్

నగర శివారు ప్రాంతాలకు తగిన తాగునీటి సరఫరా చేసేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కమిషనర్ స్వర్ణభారతి నగర్‌లోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. శివారు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై ప్రజల నుండి ఫిర్యాదులు అందుతున్నాయని, ఆయా ప్రాంతాలకు తాగు నీటిని అందించేందుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. ప్రధాన పైప్‌లైన్లపై ఉన్న లీకులను వెంటనే మరమ్మతు చేసి, పూర్తిస్థాయిలో సరఫరా జరిగేలా చూడాలన్నారు. రిజర్వాయర్ పరిధిలో తాగునీటి సరఫరా భాద్యత ఏఈదే అని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరా కొన్ని ప్రాంతాల్లో ఎక్కువ సమయం, మరి కొన్ని ప్రాంతాలకు అతి తక్కువ సమయం జరుగుతుందని, కావున సరఫరా సమయాన్ని నివాసాలు, జనాభా మేరకు రేషనలైజేషన్ చేయాలన్నారు. అనంతరం పారిశుధ్య పనులు పరిశీలించి, ప్రతి ఇంటి నుండి నిర్దేశిత సమయంలో చెత్త సేకరణ జరగాలన్నారు. పర్యటనలో కార్పొరేటర్ బి.స్మిత పద్మజ, డిఈఈ హనీఫ్, ఏఈ అనూష తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో గో గ్రహణం నాటిక ప్రదర్శన

ప్రజాశక్తి - ఎఎన్‌యు



వర్సిటీలోని ఎస్పీ బాలసుబ్రమణ్యం స్కూల్ ఆఫ్ పర్ఫార్మింగ్ అండ్ ఫైన్ ఆర్ట్స్‌లో థియేటర్ ఆర్ట్స్ విద్యార్థి కళాకారుల చేత ఆధునిక వీధి నాటిక గో గ్రహణం శనివారం ప్రదర్శించారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న స్థితిగతులను, సమస్యలను తెలియజేసే గో గ్రహణం వీధి నాటికను కళ్ళకు కట్టినట్టుగా ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను విశ్వవిద్యాలయ ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సింహాచలం తిలకించి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న రోజుల్లో మరిన్ని ఆదర్శవంతమైన నాటికలు ప్రదర్శించాలని, తోటి విద్యార్థులలో వారి నడవడికలోనూ, ఆలోచనలలోనూ మార్పు వచ్చేటట్టుగా ఉండాలని సూచించారు. వీధి నాటికను దర్శకత్వం వహించి నిర్వహించిన శాఖాధిపతి డాక్టర్ ఎల్వి నాగభూషణరావు మాట్లాడుతూ ఈకోర్సులో విద్యార్థులు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో విద్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



యునివర్సిటీలో పలువురికి పదోన్నతులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శనివారం పలువురికి పదోన్నతులు లభించాయి. ఈ మేరకు ఇన్చార్జి ఉపకులపతి ఆచార్య కె. గంగాధర రావు, ఇన్చార్జి రెక్టర్ ఆచార్య కె. రత్న షీలామణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం పదోన్నతులు పొందిన వారికి ఉత్తర్వులను అందజేశారు. పదోన్నతులు పొందిన వారిలో డిప్యూటీ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ హోదాలలో 29 మంది ఉత్తర్వులను అందుకున్నారు. పదోన్నతులు పొందిన ఉద్యోగులు ఉపకులపతి, రెక్టర్, రిజిస్ట్రార్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో వికాస ప్రధాన కార్యదర్శి కావూరి శ్రీనివాసరావు, జాయింట్ రిజిస్ట్రార్ సత్యవతి, ఎస్సీ యూనియన్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



అన్నపూర్ణను అభినందిస్తున్న ఐద్వా, సిపిఎం నాయకులు

పర్వతారోహకురాలు అన్నపూర్ణకు అభినందనలు

ప్రజాశక్తి-తాడేపల్లి

రష్యాలోని ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించిన అన్నపూర్ణకు శనివారం తాడేపల్లిలోని ఆమె నివాసంలో ఐద్వా, సిపిఎం నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. యూరప్‌లో ఎత్తైన ఎల్బ్రస్ పర్వతం సముద్ర మట్టానికి 5,642 మీటర్లు విజయవంతంగా అధిరోహించడం, అన్నపూర్ణ తాడేపల్లికి చెందిన యువతి కావడం అభినందనీయమని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి దొంతిరెడ్డి విజయ, సిపిఎం నాయకులు డివి భాస్కరరెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, డి.దశరథరామిరెడ్డి, డి.యోహాన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అధికారం ఉన్నా వీడని నైరాశ్యం

వీక్షణం

అధికారం వచ్చిందన్న తృప్తి తప్ప టిడిపి నేతల్లో గతంలో మాదిరి హుషారు కన్పించడం లేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2014-19 మధ్య టిడిపి నేతల్లో ఉన్న దూకుడు, హడావుడి, ప్రజల్లోకి దూసుకొని పోవడం, ప్రతిపక్ష పార్టీలపై విమర్శలు ఇప్పుడు మచ్చుకయినా కన్పించడం లేదు. పార్టీలో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా కన్పిస్తుంది. కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలకు, మంత్రులకు ఇంత వరకు అభినందన సభ కూడా ఏర్పాటు చేయలేదు. పార్టీ పదవులలో ఉన్న వారు, ఎమ్మెల్యేలుగా గెలిచిన వారు కూడా జిల్లా పార్టీ కార్యాలయానికి అరుదుగా వస్తున్నారు. గత మూడు నెలల్లో ఇంత వరకు పార్టీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశాలు జరగలేదు. ఎన్నికల ముందు అడపాదడపా కూటమి సమావేశాలు గుంటూరులోని టిడిపి కార్యాలయంలో ఉమ్మడి జిల్లా నేతలతో సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల తరువాత మళ్లీ జిల్లా అభివృద్ధి, ప్రధాన సమస్యలపై ఇంత వరకు ఒక్క సమావేశం నిర్వహించలేదు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యలపై సమిష్టి సమావేశం నిర్వహించలేదు. ఎమ్మెల్యేలు గెలిచిన వారు తాము నియోజకవర్గాల ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు నిధులు ఎలా సమకూర్చుకోవాలి. అభివృద్ధి పనులు ఎలా చేపట్టాలన్న అంశంపై ఇంత వరకు ఎటువంటి కార్యచరణ చేపట్టలేదు. మరో వైపు నామినేటెడ్ పదవులపై ఎంతో ఆశలు పెట్టుకున్న టిడిపి నాయకులకు నిరాశ కన్పిస్తుంది. పార్టీకి 30 ఏళ్లకు పైగా సేవలు అందిస్తున్న నేతలకు ప్రాధాన్యత కలిగిన పదవులు దక్కుతాయన్న నమ్మకం లేకుండా పోయింది. 2024 ఎన్నికల్లో జనసేన, బిజెపిలో పొత్తు వల్ల పోటీ చేసే అవకాశాలు కోల్పోయిన పార్టీ ఇన్‌ఛార్జిలకు, టిక్కెట్లు దక్కక పోవడం వల్ల టిడిపి నుంచి పోటీ చేయలేకపోయిన నాయకులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని అధిష్టానం నిర్ణయం తీసుకున్నా కూటమి నేతల మధ్య సమన్వయం కొరవడి ఇంత వరకు పదవుల పంపకం కొలిక్కిరాలేదని ప్రచారం జరుగుతోంది. నామినేటెడ్ పదవుల్లో టిడిపి 60 శాతం, జనసేనకు 30, బిజెపికి 10 శాతం ఇస్తారని ప్రచారం జరిగినా ఆచరణలో ఇది ఎంత వరకు సాధ్యం అన్న ప్రశ్న మూడు పార్టీల నేతల్లో వ్యక్తం అవుతోంది. నామినేటెడ్ పోస్టులతో పాటు ఎమ్మెల్సీ పదవులపై పలువురు ఆశలు పెట్టుకున్నారు. పొత్తుల వల్ల అవకాశం కోల్పోయిన వారికి, వేర్వేరు కారణాల వల్ల పోటీకి అవకాశం దక్కని వారికి ఎమ్మెల్సీలుగా అవకాశం ఇస్తామని చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. కానీ ఎమ్మెల్సీ పదవులు దక్కాలంటే కనీసం మరో ఏడాదికి పైగా వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. 2025లో రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే 8 ఖాళీల్లో జిల్లాకు చెందిన వారికి దక్కుతాయా లేదా అన్న అంశం చర్చనీయాంశంగా మారింది. కూటమి పొత్తులో సీటు కోల్పోయిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇస్తారని ప్రచారం జరుగుతోంది. గత ఎన్నికల్లో టిక్కెట్లు కొమ్మాలపాటి శ్రీధర్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తానని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలోనే నేరుగా హామీ ఇచ్చారు. టిడిపిలో చేరడం వల్ల ఏడాది ముందే జంగా ఎమ్మెల్సీ పదవిని కోల్పోయారు. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద ఆయనపై మండలి చైర్మన్ అనర్హత వేటు వేశారు. దీంతో ఆయన ఏడాది ముందే ఎమ్మెల్సీ స్థానం కోల్పోయారు. గత ఏడాది ఎమ్మెల్సీ ఎన్నికలప్పుడు టిడిపి అభ్యర్థి పంచుమర్తి అనూరాధా విజయంకు సహకరించిన తాడికొండ మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నారు. వీరితో పాటు జనసేన నుంచి బోనబోయిన శ్రీనివాస యాదవ్, ఆళ్ల హరి, కల్యాణం శ్రీనివాసరావు, నాయబ్ కమాల్, గాదె వెంకటేశ్వరరావు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. టిడిపిలో ఇంకా అనేక మంది సీనియర్లు, మాజీ మంత్రులు తమకు పదవులు వస్తాయో రావో అని మీమాంసలో ఉన్నారు.

(ఎ.వి.డి.శర్మ)

సిఎంఎ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ ప్రభంజనం

ప్రజాశక్తి-గుంటూరు



కె.తేజశ్విని



ఎం లక్ష్మీనారాయణ



పి జైమిత్ర

ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్స్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సిఎంఎ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థ అఖిలభారత స్థాయిలో ప్రభంజనం సృష్టించిందని విద్యాసంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలియజేశారు. శనివారం మీడియా సమావేశంలో ఫలితాల వివరాలను వెల్లడించారు. సిఎంఎ ఫైనల్ ఫలితాల్లో మొదటి 10 ర్యాంకులలో కె.తేజశ్విని ఆలిండియా 1వ ర్యాంకు, జైమిత్ర పబ్బిశెట్టి 3వ ర్యాంకు, శ్రీతష్ ఇందుపురి 8వ ర్యాంకు సాధించారన్నారు. వారితోపాటు 50 ర్యాంకులలోపు సాధించిన వారు 14 మంది ఉన్నారని తెలిపారు. అలాగే సిఎంఎ ఇంటర్ ఫలితాల్లో మొదటి 50 ర్యాంకులలో మునగా వెంకటలక్ష్మీనారాయణ ఆలిండియా 3వ ర్యాంకు, పక్షల్ జైన్ ఆలిండియా 9వ ర్యాంకు సాధించారని, ఇతర ర్యాంకులు సాధించిన వారు 25 మంది ఉన్నారన్నారు. సిఎంఎ ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో ఆలిండియా మొదటి 10 ర్యాంకులలో 5 ర్యాంకులు మాస్టర్ మైండ్స్ విద్యార్థులే కైవశం చేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను అభినందించారు.

8968 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా

ప్రజాశక్తి-గుంటూరు

ఉచిత ఇసుక విధానం అమలులో భాగంగా శనివారం సాయంత్రం 6 గంటల వరకూ 8968 మెట్రిక్ టన్నుల ఇసుకను సరఫరా చేసినట్లు మైనింగ్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జులై 8వ తేదీ నుండి చేపట్టిన ఉచిత ఇసుక విధానంలో భాగంగా జిల్లాలో నాలుగు స్టాక్ యార్డులు ఏర్పాటు చేశారు. శనివారం ఒక్క రోజే 6696 మెట్రిక్ టన్నులకు సంబంధించిన 600 బుకింగ్స్ వచ్చాయని, వాటిలో 558 బుకింగ్స్‌కు సరఫరా చేశామని, 42 ఆర్డర్లకు పెండింగ్‌లో ఉందన్నారు. కాగా స్టాక్ యార్డులలో ఇంకా 5,11,348 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని వివరించారు.

పశువులు రోడ్లపైకి వస్తే స్వాధీనం

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో ఆవులు, పందులను, గాడిదలను యజమానులు తమ ఇంటి పరిసరాల్లోనే కట్టడి చేసుకోవాలని, రోడ్ల మీదకు వదిలితే వాటిని నగరపాలక సంస్థ సిబ్బంది స్వాధీనం చేసుకుంటారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో నగర ప్రజలకు స్పష్టం చేశారు. మెయిన్‌రోడ్లపై ఆవులను సదరు యజమానులు ఇష్టానుసారం వదిలి వేయడం వలన వాహనదార్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని సమయాల్లో తీవ్ర ప్రమాదాలు కూడా జరుగుతున్నాయన్నారు. రోడ్లపై పందుల నియంత్రణకు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పందుల పెంపకందార్లు జిఎంసి నుండి లిఖితపూర్వక అనుమతులు, లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రజారోగ్యానికి హానికరమైన ఎటువంటి జంతువులను తన నివాస ప్రాంగణంలో ఉంచటానికి వీలు లేదన్నారు. అటువంటి పందులు, ఆవులు, గాడిదలు, పెంపుడు కుక్కలు రోడ్ల మీదకు వస్తే వాటిని ప్రజారోగ్య దృష్ట్యా నగరపాలక సంస్థ సిబ్బంది స్వాధీనం చేసుకుటుందని స్పష్టం చేశారు.

వర్సిటీలో అరబిక్ భాషలో సర్టిఫికెట్ కోర్సు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయములోని అంతర్జాతీయ విద్యార్థుల విభాగం ఆధ్వర్యంలో మూడునెలల కాల వ్యవధిలో 'సర్టిఫికేట్ కోర్స్ ఇన్ అరబిక్ లాంగ్వేజ్' కోర్సును ప్రారంభిస్తున్నట్లు ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ ఆచార్య పి. పద్మావతి శనివారం తెలిపారు. ఈ కోర్సు తరగతులను గుంటూరులోని అభ్యుదయ మహిళా కళాశాల ప్రాంగణంలో ప్రతిరోజు సాయంత్రం రెండు గంటలు పాటు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కోర్సుతో గల్ఫ్ దేశాలలో, కార్పోరేట్ కంపెనీలలో అపార ఉద్యోగ అవకాశాలు ఉంటాయని విశ్వ విద్యాలయ ఇన్చార్జి ఉపకులపతి ఆచార్య గంగాధర రావు తెలిపారు. గుంటూరు పరిసర ప్రాంతాల వారికి అందుబాటులో ఉండేలా ఈ తరగతులను అభ్యుదయ మహిళా కళాశాలలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కోర్సుకు 8వ తరగతి చదివిన ప్రతి ఒక్కరు అర్హులేనని, మూడు నెలలకు ఫీజు రూ.2,000 చెల్లించాలని ఆచార్య జి .సింహచలం తెలిపారు. హైదరాబాద్ ఇఫ్లూ విశ్వ విద్యాలయంలో పిహెచ్‌డిలో నిష్ణాతులైన డాక్టర్ షేక్ మొహమ్మద్ ఇషాక్ ఆధ్వర్యంలో తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ కోర్సును ఆసక్తి కలిగిన అభ్యర్థులు అభ్యుదయ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రోహిణి దేవిని నేరుగా కలసి ప్రవేశాలు పొందవచ్చునని పేర్కొన్నారు .వివరాలకు ఫోన్ నంబర్లు 0863- 2231359, 9848139454 లను సంప్రదించాలని ఆచార్య పద్మావతి సూచించారు.

హెడ్ వాటర్ వర్క్సును పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో ఎక్కడా రాజీలేదని, తాగునీటి సరఫరాపై సమగ్ర నివేదిక ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ హెడ్ వాటర్ వర్క్సుని పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత హెడ్ వాటర్ వర్క్సుకి ప్రకాశం బ్యారేజ్ నుండి ప్రతిరోజు ఎంత ముడి నీరు వస్తుంది, దాని ట్రీట్మెంట్, సరఫరా, క్లోరినేషన్, ఆలం మిక్సింగ్, నీటి శ్యాంపిల్స్ పరీక్షలు తదితర అంశాలు అధికారులను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. అనంతరం బాలాజీ నగర్‌లోని మొండి గేటు దగ్గర డ్రైన్ రైల్వే క్రాసింగ్‌ని పరిశీలించారు. పర్యటనలో ఈఈ శ్రీనివాస్, డిఈఈ శ్రీధర్, ఏఈలు బాబర్, సునీల్ కుమార్, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.